# ధరల్లో మార్పు లేదు

>> చేసింది. వినియోగదారులపై భారం పడకుండా ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన ధరల పెరుగుదలపై వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ వినియోగదారులకు ఊరటనిచ్చింది. వీటితో పాటు వంట గ్యాస్ (డొమెస్టిక్ సిలిండర్) ధరలను కూడా పెంచడం లేదని కేంద్రం స్పష్టం చేసింది. సామాన్యులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల్లో మార్పులు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ధరల స్థిరీకరణకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

ఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన అంతరాయాల నేపథ్యంలో వంటగ్యాస్ దిగుమతుల ధరలు విపరీతంగా పెరగడంతో, గృహాలను ఆదుకోవడానికి దేశంలో కేవలం వాణిజ్య ఎల్పీజీ ధరను మాత్రమే పెంచినట్లు, దేశీయ ఎల్పీజీ ధరలను యథాతథంగా ఉంచినట్లు పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ బుధవారం స్పష్టం చేసింది. "పరిశ్రమలు, హోటళ్లు ఉపయోగించే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలు నియంత్రణ రహితమైనవి, మార్కెట్ ఆధారితమైనవి. సాధారణంగా నెలవారీగా సవరించబడతాయి. దేశంలో వినియోగించే మొత్తం ఎల్పీజీలో వీటి వినియోగం 10 శాతం కంటే తక్కువగా ఉంటుంది" అని మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచవ్యాప్త ఎల్పీజీ సరఫరాలలో 20-30శాతం హోర్ముజ్ జలసంధిలో నిలిచిపోవడంతో, సౌదీ కాంట్రాక్ట్ ధర మార్చిలో 542/ఎంటి నుండి ఏప్రిల్‌లో 780/ఎంటికి, అంటే 44 శాతం పెరగడమే ఏప్రిల్ 1న వాణిజ్య సిలిండర్ల ధరల పెంపునకు కారణమని ఆ ప్రకటనలో పేర్కొంది. "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీకి అనుగుణంగా, 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధర రూ.913 వద్ద యథాతథంగా కొనసాగడంతో దేశీయ వినియోగదారులకు సమగ్ర రక్షణ కల్పించబడింది. అదేవిధంగా, పిఎంయువై పథకం కింద పేదల కోసం రాయితీపై అందిస్తున్న ఎల్పీజీ సిలిండర్ల ధర రూ.613 వద్ద యథాతథంగా ఉంది," అని ఆ ప్రకటన వివరించింది. ప్రస్తుత ధరల వద్ద, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి సిలిండర్‌పై రూ.380 నష్టాన్ని చవిచూస్తున్నాయని అది ఇంకా పేర్కొంది.

సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా లీటరుకు రూ.94.77, రూ. 87.67 వద్ద (ఢిల్లీ ధరలు) ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతున్నాయని ఆ ప్రకటన స్పష్టం చేసింది.

ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలలో చమురు ధరలు 3050 శాతం వరకు పెరిగినప్పటికీ, భారతదేశంలోని ప్రతి పెట్రోల్ పంపు వద్ద సాధారణ పెట్రోల్ మరియు డీజిల్ ధరలు ఎటువంటి మార్పు లేకుండానే లభిస్తున్నాయని ఆ ప్రకటన పేర్కొంది.

# 'చేతి'లోనే భవిష్యత్తు

>> -సీపీఎం మధ్య సైలెంట్ అండర్‌స్టాండింగ్ ఉందని అన్నారు. అందుకే వారిపై ఎటువంటి కేసులు ఉండవని విమర్శించారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తారని.. కానీ, విజయన్ సర్కారుపై ఈగ కూడా వాలనీయరని ఆగ్రహించారు. బీజేపీ, ఎల్‌డీఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్టు కనిపించినా, అది ఉత్తిత్తిదేనని చెప్పారు. కేరళం సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు. విద్యా రంగంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన ప్రగతిని సీఎం వివరించారు. దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళంకు ఉన్న గుర్తింపును రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. విద్యా, అవగాహన, సామాజిక చైతన్యంలో కేరళం దేశానికి అప్పటికీ, ఇప్పటికీ నమూనాగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీ, ఏకే ఆంటోనీల కృషి ప్రధాన కారణమన్నారు. వాళ్లు కేరళంకు సమగ్ర, సమ్మిళిత, సమతుల్య, నిష్కళంక రాజకీయాలను అందించారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కరుణాకరన్ కేరళలో అభివృద్ధికి బాటలు వేశారని, ఊమెన్ చాందీ సంక్షేమంఅభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చారని, ఏకే. ఆంటోనీ నిజాయితీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనలో కేరళంకు గౌరవం, నమ్మకం, పరిపాలనా స్థిరత్వం వచ్చిందన్నారు. కేరళంను"గాడ్స్ ఓన్ కంట్రీ" గా పిలుస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే, దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కేరళం ఒక బ్రాండ్‌గా నిలిచిందన్నారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం, సామాజిక పురోగతి ఇవన్నీ కేరళంను ఒక ప్రత్యేక రాష్ట్రంగా నిలబెట్టాయన్నారు..గత 12 ఏండ్లుగా ఢిల్లీలో... 10 ఏండ్లుగా కేరళంలో పరిస్థితులను పూర్తిగా దిగజారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోడీ, కేరళంలో విజయన్ "డబుల్ ఫెయిల్యూర్"గా నిలిచారని సీఎం విమర్శించారు. ఢిల్లీలో మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం, తిరువనంతపురంలో విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ సర్కారులో దేశం, రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లాయని విమర్శించారు. వీరి ఇరువురి సిద్ధాంతాలు వేరు అయినా... వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు.సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళం కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేరళం కుటుంబ సభ్యుల్లా మారారని సీఎం తెలిపారు. మలయాళీ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నరసింహం సినిమాలో చెప్పిన 'నీ పో మోనే.. దినేశా' స్టైల్‌లో 'నీ పో మోనే విజయన్.. యువర్ టైమ్ ఈజ్ ఓవర్' (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన డైలాగ్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. మలయాళంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుకరించడంతో యువత నుంచి భారీ స్పందన లభించింది. యంగ్ సీఎం... డైనమిక్ సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కేరళం ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి , కేరళం కాంగ్రెస్ ఎన్నికల స్టార్ క్యాంపయినర్ శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారితో కలిసి అలెప్పి జిల్లా కయంకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రోడ్ షోలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్' జీతాలు అకౌంట్లలోకి

>> ఆరోగ్యశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐఎఫ్ఎంఎస్) ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపించారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు,టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు,స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు, టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో,పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా 1వ తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

# టీ ఆకులు కోస్తూ.. రాగాలు తీస్తూ..

## ది బ్రూగఢ్ టీ తోటల్లో ప్రధాని మోడీ

## మహిళా కార్మికులతో పిఎం ముచ్చట్లు



అసోంలోని ది బ్రూగఢ్ టీ తోటల్లో కార్మికులతో సెల్ఫీ దిగుతున్న ప్రధాని మోడీ

**దిబ్రూగఢ్, ఏప్రిల్ 1:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం అసోంలోని దిబ్రూగఢ్ జిల్లాలో ఒక టీ తోటను సందర్శించారు. అక్కడ ఆయన మహిళా కార్మికులతో ముచ్చటించి, అసోం టీకి ఉన్న ప్రపంచ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో తన అనుభవాన్ని పంచుకుంటూ, ప్రధానమంత్రి టీని "అసోం ఆత్మ"గా అభివర్ణించారు. అసోం టీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. ఈ పర్యటనను "మరపురాని అనుభవం"గా పేర్కొన్నారు. "ప్రతి ఒక్క టీ తోట కుటుంబం కృషికి తాము చాలా గర్వపడుతున్నాము. వారి కఠోర శ్రమ, పట్టుదల అసోం గౌరవాన్ని పెంచాయి" అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. పర్యటనకు సంబంధించిన ఫొటోలను పంచుకుంటూ, ప్రధాని మోడీ ఇలా రాసుకొచ్చారు, "తేయాకు కోయడం అనంతరం మహిళలు తమ సంస్కృతి గురించి మాట్లాడారు, ఆ తర్వాత ఒక సెల్ఫీ కూడా తీసుకున్నారు" అని పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద తేయాకు ఉత్పత్తి ప్రాంతాలలో ఒకటైన అసోం, భారతదేశ తేయాకు ఎగుమతులలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ పరిశ్రమ లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. దిబ్రూగఢ్, టిన్సుకియా, జోర్హాట్‌తో సహా పలు జిల్లాల్లోని తేయాకు తోటలలో పనిచేసే వారిలో మహిళల వాటా గణనీయంగా ఉంది. ప్రధాని మోడీ పర్యటనను ప్రతీకాత్మకంగానూ, వ్యూహాత్మకంగానూ పరిగణిస్తున్నారు. ఇది అసోం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో తేయాకు పరిశ్రమ ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది.

తేయాకు తోటల కార్మికులను ఉద్దేశించి ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఈ పరిశ్రమతో అనుబంధం కలిగిన భారీ సంఖ్యలోని ఓటర్లను విశేషంగా ఆకట్టుకునే అవకాశం ఉంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అలాగే తేయాకు ఉత్పత్తితో సహా అసోంలోని కీలక రంగాలకు కేంద్రం అందిస్తున్న మద్దతుపై ప్రధానంగా దృష్టి సారిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా తన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ప్రధానమంత్రి కొనసాగించే అవకాశం ఉంది.

## నేడు, రేపు పుదుచ్చేరిలో డి.సిఎం భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్1:** పుదుచ్చేరిలో రెండు రోజుల పాటు ఎన్నికల ప్రచారం చేసేందుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెళ్లారు. 2,3 తేదీల్లో వివిధ ప్రాంతాల్లో ఎన్నికల ర్యాలీలు సభల్లో డిప్యూటీ సిఎం ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 4వ తేదీన కేరళం రాష్ట్రం పట్నం తిట్టు నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

## 31 వేల ఎకరాల్లో అకాల నష్టం

>> బీచుపల్లి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పామాయిల్ గెలల ధరలు పెరిగాయని, టన్ను గెలల ధర రూ.21, 546 నుండి రూ. 1459 మేర పెరిగి రూ.23, 005కు చేరిందన్నారు. పెరిగిన ధరలపై రైతులకు అవగాహన కల్పించి సాగుపై ఆసక్తిని పెంచాలన్నారు.

## వారం - వర్జ్యం

02-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, రేవతి కార్తె
○పౌర్ణమి ఉ.7.42
హస్త సా.5.41
వర్జ్యం : రా.2.16-తె.4.00
దు.ఉ.10.07-ఉ.10.56, 2)మ.3.03-మ.3.52
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సువర్ణాభరణముల భద్రత విషయంలో జాగ్రత్తలు అవసరం. బంధువుల కలయికతో ఆనందం కల్గుతుంది.

**వృషభం:** విదేశీయాన ప్రయత్నాలకు సాంకేతిక పరమైన చిక్కులు సంభవించ వచ్చును. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:**మీరు ఓర్పుగా కష్టించి తగిన ఫలితాలు పొందుతారు. సంఘంలో పెద్ద మనుషులతో పరిచయాలు కలుగుతాయి.

**కర్కాటకం:**మిత్రవర్గం వారికి కొన్ని కష్టాలు కలిగినప్పుడు మీరు ఆదుకోగలుగుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**సింహం:**దీర్ఘకాలిక పొదుపు పెట్టుబడులు కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**కన్య :**పిల్లల చదువు మీద శ్రద్ధ చూపించి తగిన ఫలితాలు పొందుతారు. క్రీడల యందు ఆసక్తి కలిగిఉంటారు.

**తుల :** ఎంతో సాధించాలన్న మీ తపన పూర్తి స్థాయిలో కాకపోయినా కొంతమేరకు సఫలీకృతమవుతుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:**మానసికోల్లాసం కలిగిఉంటారు. గడియారంతో సమానంగా పరుగు పెడతారు. కాలానికి ప్రాముఖ్యత నిస్తారు.

**ధనుస్సు:** పెండింగ్ పనులు పూర్తి చేయడానికి నూతన ప్రణాళికలను అమలు పరుస్తారు. అందువల్ల లాభపడగలుగుతారు.

**మకరం:**అవుతాయో! కావో! అని అనుమానంతో మొదలుపెట్టిన పనులే ఈరోజు విజయవంతంగా పూర్తవుతాయి.

**కుంభం:**సంస్థలో మీరు ఆశించిన మార్పులను సాధించగలుగుతారు. జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడతాయి.

**మీనం :** రూఢీగా అవుతాయనుకున్న పనులు సాంకేతిక కారణాలవలన వాయిదా పడతాయి. మీ శ్రమ మాత్రమే కనబడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హార్ముజ్ తెరిస్తేనే శాంతి

>> అయ్యాయి. ప్రాంగణం వెలుపల క్షిపణి దాడిజరిగిన ఆనవాళ్లులేవని బాంబుదాడి ప్రాంగణం లోపల జరిగిందని సాక్షులు చెపుతున్నారు. బుధవారం కూడా ఇజ్రాయెల్ అమెరికా యుద్ధవిమానాలు విరుచుకుపడ్డాయి. రాజకీయ నేతల నివాసాలు, సైనిక స్థావరాలు, క్షిపణి గగనతల రక్షణ వ్యవస్థలు, ఐఆర్‌జిసి కమాండ్ సెంటర్లు వంటి వాటిపైనే ముఖ్యంగా ఇజ్రాయెల్ బాంబులు కురిపిస్తోంది. టెహ్రాన్‌లో తోఫిక్‌దారు అనే ఔషధ కంపెనీపైనా ఐడిఎఫ్ దాడిచేసింది. ఔషధాల కేంద్రాలపై దాడియుద్ధనేరాలకిందకు వస్తుందని ఇరాన్ హెచ్చరించింది. అలాగే జంజన్‌నగరంలో ఉన్న ప్రసిద్ధ షియా మసీదుపై ఇజ్రాయెల్ అమెరికా సైనికదాడులు జరిగాయి. దాడుల్లో మసీదు ధ్వంసం అయింది. ఇజ్రాయెల్ దాడులకుధీటుగా ఇరాన్‌కూడా అరబ్బు దేశాల్లోని అమెరిక ఆస్థావరాలు, యూనివర్సిటీలు, టెక్‌కంపెనీలపై క్షిపణులు,డ్రోన్లప్రయోగించింది. ఇరాన్‌క్షిపణులు రాకతో టెల్ అవీవ్‌నగరం మొత్తంసైరన్‌లు మోగాయి. ఇరాక్‌లోని బాగ్దాద్ అమెరికా విక్టోరియా ఎయిర్‌బేస్‌పై దాడిజరిగింది. ఎర్బిల్‌లోని అమెరికా ఆస్తులపై ఇరాన్‌డ్రోన్లు విరుచుకుపడ్డాయి. బహ్రెయిన్‌లోని అమెజాన్ డేటా సంస్థపైనా ఇరాన్ క్షిపణి దాడిచేసింది. డేటా సెంటర్ మెయిన్‌టార్గెట్‌కాకపోయినా సమీపంలో జరిగిన దాడితో డేటా సెంటర్ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. వర్క్‌లోడ్‌ను ఇతరప్రాంతాలకు బదిలీచేసుకోవాలని అమెజాన్‌క్లౌడ్ కస్టమర్లను అలర్ట్‌చేసింది. ఇదిలా ఉంటే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా దేశాలు ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధంలో అమెరికాకు మద్దతిచ్చాయి. తాముసైతం యుద్ధంలోకి వచ్చి తమ దేశ ఆస్తులను రక్షించుకుంటామని ప్రకటించాయి. ఇదిలా ఉంటే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ యుద్ధం ముగింపు తమకు కూడా సుముఖమేనని అయితే మళ్లీ దాడులు జరగవని స్పష్టమైన హామీలు ఇస్తేనే అది సాధ్యం అవుతుందని అంతర్జాతీయ మీడియాతోమాట్లాడుతూ చెప్పారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో మాట్లాడుతూ భవిష్యత్తు దాడులనుంచి రక్షణ కల్పించేచర్యలు ఎలాంటి తీర్మానంలో అయినా తప్పనిసరిగా ఉండాలని ఇరాన్ అధ్యక్షుడు డిమాండ్‌చేసారు. భవిష్యత్తులో దురాక్రమణ పునరావృతం కాకుండా హామీలు ఇస్తే సంఘర్షణ ముగించేందుకుతాము సిద్ధమేనని పెజెష్కియాన్ చెప్పినట్లు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ప్రకటన విడుదలచేసింది. ఇదిలా ఉంటే తాము ఇరాన్‌యుద్ధంలో పాల్గొనబోమని అయితేహార్ముజ్‌జలసంధిని తెరిపించేందుకుగాను బ్రిటన్ 35 దేశాలతో సంప్రదింపులు జరిపి కూటమిగా తెరపైకి తెచ్చేందుకు కృషిచేస్తుందని బ్రిటన్‌ప్రధాని కీర్ స్టార్మర్ వెల్లడించారు. దీనితో నాటో సభ్యదేశాలు కూడా యుద్ధంలో పాల్గొనేందుకు సుముఖంగా లేవన్నది తేలిపోయింది. అలాగే ఇరాన్ ఇస్ఫహాన్ కేంద్రంగాపై బాంబులు మోతమోగించిన అమెరికా ఇజ్రాయెల్‌లు అక్కడ ఇరాన్ భద్రపరిచిందని చెపుతున్న 540 కిలోల యురేనియం నిల్వలు ఏమయ్యాయన్నదానిపై రెండుదేశాలు కూడా స్పష్టత ఇవ్వలేదు.




బుధవారం పార్లమెంటు వద్ద ఆందోళన చేస్తున్న విపక్ష ఎంపీలు

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఓకే

>> చట్టం 2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోం శాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సుమారు 2 గంటలపాటు చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని కొనియాడారు. జగన్ అణచివేత వల్లే అమరావతి ఒక ఉద్యమంగా మారి దేశాన్ని ఆకర్షించిందని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు. అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీలన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాజధాని ఏర్పడింది: రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. దేశం మొత్తం రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపితే వైఎస్సార్సీపీ మాత్రం వ్యతిరేకించడం దురదృష్టకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు సందర్భంగా లోక్‌సభలో కలిశెట్టి మాట్లాడారు. వైఎస్సార్సీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేసి రైతుల త్యాగాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లు ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్ధలు కొట్టారు.

**అమరావతి బిల్లుకు వైఎస్సార్సీపీ**

వ్యతిరేకం: అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

## 'ఆర్ఆర్' టాక్స్‌తో దోపిడీ

>> జాతీయ రహదారులు మొదలుకుని అన్ని రకాల అభివృద్ధి పనులకు కేంద్రం అండదండగా నిలుస్తోంది. 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ ఏకకాలంలో చేసుకుంటున్నాం. గతంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులుంటే ఈ పదేళ్లలో అదనంగా దాదాపు 3 వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ.. తెలుగు రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసింది కాబట్టే.. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఇవాళ తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన.. అమరావతి రాజధానిగా ఏర్పాటవుతున్న సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు. అమరావతి అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# జాతీయ అవార్డులు

>> గుడ్‌ఫర్ గవర్నెన్స్ విభాగంలో వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలం మోతుకుపల్లి గ్రామ పంచాయతీ పురస్కారం దక్కించుకుంది. గ్రామస్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది. అలాగే సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషికిగాను ఈ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణమన్నారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ అవార్డులు నిదర్శనమన్నారు. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందించారు.

## నేటి నుంచి 5 మండలాల్లో అమలు

>> రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం నాడు ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2 నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన పనిలేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని అన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుంది. ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వే కూడా రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్ల కేటాయింపు జరుగుతుంది. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి.సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎమ్ఎస్ అలర్ట్స్ పంపిస్తారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని ఈ 5 మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ (ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు.

## పెరిగిన మీ సేవా
# చార్జీలు

**హైదరాబాద్, ఏప్రిల్1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పలు సేవలు అందిస్తున్న మీ సేవా కేంద్రాల్లో పలు సర్వీసు చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెరిగిన చార్జీలు బుధవారం నుంచే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టంగా పెర్కొంది. వినియోదారు లకు అందిస్తున్న సర్వీసులను రెండు రకాలుగా విభిజస్తూ ఏ (రీ ఇస్యూ ఆఫ్ సర్టిఫికేట్స్, ఈసీ (ఇన్‌కంబర్‌రెన్స్ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికేట్) కేటగిరిలోని సర్వీసులకు రూ.62 రూపాయలను, అదే విధంగా బి కేటగిరి సర్వీసు (ఇన్‌కమ్ సర్టిఫికెట్, కమ్యూనిటీ సర్టిఫికేట్, రెసెడెన్స్ సర్టిఫికెట్, అప్లికేషన్ ఫర్ న్యూ ఫుడ్ సెక్యూర్టీ కార్డు, కరక్షన్ ఆఫ్ ఫుడ్ సెక్యూర్టీ కార్డు, ఓబీసి, లేట్ బర్త్, డెత్, ఎలక్ట్రిసిటీ న్యూ కనెక్షన్, ఫ్యామీలీ మెంబర్‌షిప్, ఈడబ్లూస్, ఈ డబ్లూస్, భూ భారతి కేవైసీ, ఈబీసీ సర్టిఫికెట్ల)కు రూ. 80 వసూలు చేయాలని పేర్కొంది. కొన్ని విద్యుత్‌శాఖ, రవాణాశాఖలు తమ సేవల ను వినియోగాదారులకు అందించేందుకు ప్రత్యేకంగా యాప్‌లను, ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చుకొగా ఇతర సేవలను ఈ కేంద్రాలు అందిస్తున్నాయి. నగరంలో 56 కేంద్రాలు ప్రజలకు 100కు పైగా సేవలను అందిస్తున్నాయి. అవగాహన కోసం సర్వీసు చార్జీల పెంపునకు సంబంధించి కేంద్రాల్లో బ్యానర్లను కూడా ఏర్పాటు చేస్తామని వారు చెబుతున్నారు.

## కాంగ్రెస్ యువరాజుకు
# వందోసారి ఓటమి తథ్యం

**ఇచ్చిన మాట నిలబెట్టుకునే చరిత్ర బిజెపిది**

**వికసిత్ అసోం ద్వారానే వికసిత్ భారత్ సాధ్యం**

**బిజెపి హ్యాట్రిక్ విజయం సాధిస్తోందంటూ ధీమా**

**గోగాముఖ్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ**



**గౌహతి, ఏప్రిల్ 1:** అసోం గొప్ప సాంస్కృతిక, చారిత్రక వారసత్వముంది. లచిత్ బోర్ఫుకాన్, భూపేన్ హాజారికా వంటి మహనీయుల సేవలు దేశానికి స్ఫూర్తినిస్తున్నాయి. అసోం గుర్తింపునకు పునాదిగా నిలుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. బుధవారం అసోంలోని బిశ్వనాథ్ జిల్లా గోగాముఖ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన విస్తృతమైన దార్శనికతను వివరించారు. అలాగే, బిజెపి వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారతదేశ భవిష్యత్తుకు అసోం కేంద్ర బిందువని పేర్కొంటూ, 'వికసిత అసోం' ద్వారా మాత్రమే 'వికసిత భారత్' సాధ్యమవుతుందని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. రాష్ట్రంలో బిజెపి 'హ్యాట్రిక్' విజయం సాధించబోతోందని పేర్కొంటూ, ఆ పార్టీ ఎన్నికల అవకాశాలపై ఆయన గట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేస్తూ, ఎన్నికలలో ఆ ప్రతిపక్ష నాయకుడు 'వంద ఓటముల' దిశగా పయనిస్తున్నారని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అసోం కోసం బిజెపి ఎన్నికల మేనిఫెస్టోను ప్రస్తావిస్తూ, అది ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని, అభివృద్ధిలో ఒక కొత్త శకానికి నాంది పలుకుతుందని ప్రధాని మోడీ అన్నారు. ప్రతిపక్ష పార్టీల్లా కాకుండా, బిజెపికి ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర ఉందని ఆయన నొక్కిచెప్పారు. సంక్షేమ చర్యల గురించి మాట్లాడుతూ, అసోంలో ప్రభుత్వ పథకాల కింద ఇప్పటికే 22 లక్షలకు పైగా కుటుంబాలు పక్కా ఇళ్లను పొందాయని, రాబోయే సంవత్సరాల్లో అదనంగా మరో 15 లక్షల పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపి అధికారంలో ఉండటంతో ఏర్పడే 'డబుల్‌ఇంజిన్ ప్రభుత్వం' ప్రయోజనాలను వేగంగా అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. మహిళా సాధికారతపై దృష్టి సారిస్తూ, సంవత్సరానికి కనీసం లక్ష రూపాయలు సంపాదించే, ఆర్థికంగా సాధికారత పొందిన మహిళలను సూచించే 'లక్షపతి బైదియో'గా అసోంలో ఇప్పటికే సుమారు మూడు లక్షల మంది మహిళలు మారారని ప్రధాని మోడీ అన్నారు. ఈ సంఖ్యను 40 లక్షలకు పెంచడమే బిజెపి లక్ష్యమని, ఇది తమ ప్రధాన ఎన్నికల వాగ్దానమని ఆయన ప్రకటించారు. మహిళల కోసం ఉద్దేశించిన నెలవారీ ఆర్థిక సహాయ పథకం 'అరుణోదయ్ పథకం'ను మరింత ఎక్కువ మంది మహిళా లబ్ధిదారులను చేర్చేందుకు విస్తరిస్తామని కూడా ఆయన తెలిపారు. ప్రధాన హామీలలో భాగంగా, అసోంలో యూనిఫామ్ సివిల్ కోడ్ (యుసిసి)ని అమలు చేయాలని బిజెపి యోచిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. బిజెపి తన వాగ్దానాలను నెరవేరుస్తుంది కాబట్టే ప్రజలు దానిని విశ్వసిస్తారని ఆయన పునరుద్ఘాటించారు. వ్యవసాయం విషయానికి వస్తే, రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది రైతులు పిఎంకిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందారని ఆయన పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల గురించి మాట్లాడుతూ, కాంగ్రెస్ ఆరు దశాబ్దాలలో బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలు మాత్రమే నిర్మించగా, బిజెపి కేవలం 10 ఏళ్లలోనే ఐదు వంతెనలను పూర్తి చేసిందని, మరో ఐదింటి పనులు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. అసోంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కేవలం బిజెపి మాత్రమే అందించగలదని ఆయన నొక్కి చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో, కాంగ్రెస్ 65 ఏళ్ల పాలనలో అసోంలో కేవలం ఆరు వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, అయితే ఇప్పుడు ఆ సంఖ్య 14కు పెరిగిందని, మరో 10 నిర్మాణంలో ఉన్నాయని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏడు ఇంజనీరింగ్ కళాశాలలు, 24 పాలిటెక్నిక్‌లు ఉన్నాయని, ఇది వేగవంతమైన విద్యా విస్తరణకు నిదర్శనమని ఆయన తెలిపారు.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాం డరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన హాజరు కాకపోవడంతో దాఖలైన కేసుల్లో ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినా, ఆయన తరఫున ఎవరూ హాజరుకాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించడం ద్వారా ట్రయల్ కోర్టు తీవ్రమైన తప్పిదం చేసిందని వాదించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జారీ చేసిన సమన్లు ఆయనకు అందినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. ట్రయల్ కోర్టు రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. గతంలో పీఎంఎల్ఏ సెక్షన్ 50 కింద ఈడీ జారీ చేసిన ఐదు సమన్లను కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులను విచారించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరాస్ దలాల్, కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పునే ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది. ఇదే సమయంలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా హైకోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు విచారణను జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం నుంచి మరో బెంచ్‌కు బదిలీ చేయాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. విచారణ నిష్పాక్షికతపై తనకు సహేతుకమైన అనుమానాలు ఉన్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.



## ఎల్ఐసి ఫిర్యాదుతో ఆర్‌కామ్
# అనిల్ అంబానీపై సిబిఐ కేసునమోదు

**ముంబయి, ఏప్రిల్ 1:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సీబీఐ బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు. ఎల్ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీడీవో ఇండియా ఎల్ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది. ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.

# అమిత్‌షా తీరు ముమ్మాటికీ రాజ్యాంగ ద్రోహమే

**కేరళ సిఎం విజయన్‌ను అదానితో పోల్చడం సిఎం రేవంత్‌కు తగదు**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** నరహంతక అరాచక ముఠా సల్వాజూడుంను రద్దు చేస్తూ సుప్రింకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గతంలో ఇచ్చిన తీర్పును పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అపహస్యం చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి న్యాయ వ్యవస్థను పరిరక్షించాల్సిన కేంద్ర మంత్రి రాజ్యాంగాన్ని అగౌవరపరిచేలా సుప్రిం తీర్పును తప్పుబట్టడం క్షమించరాని నేరమన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో నేతలు పశ్య పద్మ, ఈ.టి.నరసింహాతో కలిసి మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు సిద్ధాంత మూలం మార్క్సిజమని, తత్వం భారతదేశానిదని, దేశ కాలమాన పరిస్థితులను అనువహించుకుని రూపొందిందని చెప్పారు. దేశ స్వాతంత్ర సంగ్రామంలో ఏనలేని త్యాగాలను చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి విప్లవ వీరులను అందించడంతోపాటు అనేక సంస్థానాలను విముక్తి చేసి, భూమి, భుక్తి, పేదవర్గాల కోసం పోరాటాలు చేసి 8 గంటల పని విధానాన్ని అందించిన ఘన చరిత్ర సిపిఐ దన్నారు. దేశ స్వాతంత్రోద్యమంలో ఆర్‌ఎస్ఎస్ పాత్ర ఏమిటో అమిత్‌షా చెప్పాలని డిమాండ్ చేశారు. మావోయిజం మూలం కమ్యూనిజమని, దీనిని ఎవరూ అంతం చేయలేరని సాంబశివరావు స్పష్టం చేశారు. అర్బన్ నక్సలైట్లు అనే ముద్ర వేస్తూ పాలకులు చేసిన చట్టాలకు వారే బంధీలవుతారని హెచ్చరించారు. దళితులు ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారితే వారికి అంతకు ముందున్న కులం గాని, రిజర్వేషన్లు కాని వర్తించవని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమన్నారు. ఈ తీర్పును న్యాయ మూర్తులు పునర్ సమీక్షించాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు కమిటీ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్ స్థానాల పునర్ వ్యవస్థీకరణను ఏకపక్షంగా కాకుండా అన్ని వర్గాల నిపుణులతో ప్రత్యేక మిటీ ఏర్పాటు చేసి అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకోవాల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ ఎన్నికల ప్రచారంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌ను అదానితో సిఎం రేవంత్‌రెడ్డి పోల్చడం సరికాదన్నారు. అసెంబ్లి సమావేశాల్లో అన్ని పక్షాలకు స్పికర్ అవకాశం ఇచ్చారని, ఎవరి గొంతు నొక్కలేదని స్పష్టం చేశారు.



## రేషన్‌కార్డులు తొలగిస్తే ఊరుకోం: కవిత

**హైదరాబాద్, ఏప్రిల్1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు.

# కృష్ణా బేసిన్‌లో సాగునీటికి కటకట

**పాలమూరు ప్రాంతంలో ఎండిపోతున్న పంటలు**

**కర్ణాటక ఉప ముఖ్యమంత్రికి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ ఫోన్**

**నారాయణపూర్ జలాశయం నుంచి జూరాలకు 5 టిఎంసిలు విడుదల చేయాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** పాలమూరు ప్రాంతంలో తీవ్ర సాగునీటి కొరత ఏర్పడడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి జూరాలకు కనీసం 5 టిఎంసిల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే పాలమూరు గడ్డపై ఎండిపోతున్న పంటలు ప్రాణం పోసుకునే అవకాశం ఉంది. కాగా.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం జలకష్టంతో విలవిలలాడుతోంది. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు.



## కొండగట్టు జయంతిలో అపశ్రుతి

**కుప్పకూలిన చలువ పందిళ్లు, 15 మందికి స్వల్ప గాయాలు**

**తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**మల్యాల, ఎప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో బుధవారం మొదలైన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలలో మొదటి రోజే ఆపశృతి చోటుచేసుకుంది, ఆలయంలో తలనీలాల సమర్పణకు వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు బుధవారం తెల్లారి జాము గాలి దుమారానికి ఒక్కసారి తప్పకుండా భక్తులు ఆందోళనకు గురయ్యారు, ఈ సంఘటనలో 15 మంది భక్తులకు స్వల్ప గాయాలు కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలుగా అయ్యాయి, వీరిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు, జయంతి ప్రారంభం రోజే ఇలాంటి అపశృతి చోటు చేసుకోవడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రావేశాలకు గురయ్యారు, అధికారులు భక్తుల భద్రత పట్ల నిరక్ష ్యంల్ల వహించారని, నాసిరకం పనులను జరిపారని తీవ్రంగా మండిపడ్డారు, జయంతి సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసి కూడా పనుల్లో నాణ్యత పాటించలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఇదిలా ఉండగా రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల గాలి దుమారంతో వర్షాలు జయంతికి ఆటంకంగా నిలిచాయి, దీనికి తోడు సాధారణ ఏర్పాట్లు చేయడం గాలి దుమారానికి పందిల్లు కుప్పకూలిపోవడం సంఘటన పట్ల వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు, ఇంకా రెండు రోజులు జయంతి కి భక్తులు లక్షల్లో వచ్చే అవకాశం ఉన్నా కూడా ఆలయంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు కాలేదని వారు ఆరోపించారు.

## నేడు హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర

**పలుప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

**హైదరాబాద్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి వేడుకలకు నగరం సిద్ధమైంది. శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈశోభాయాత్ర ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగనుంది. గౌలిగూడ రామ్ మందిరం నుంచి పారడైజ్ జంక్షన్ వరకు, అలాగే కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి డీఎంహెచ్ఎస్ కోటి వరకు కొనసాగనుంది. ఈ మార్గాల్లో పుల్లిబౌలి, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఆశోక్ నగర్, గాంధీ నగర్, కవాడిగూడ, సీజీవో టవర్స్, రాణిగంజ్, పట్నీ, పారడైజ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శోభాయాత్ర చేరుకునే ప్రాంతాల్లో ట్రాఫిక్ను పూర్తిగా నిలిపివేయడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. ముఖ్యంగా అబిడ్స్, బ్యాంక్ స్ట్రీట్, ఎంజే మార్కెట్, కాచిగూడ, సుల్తాన్ బజార్, ముషీరాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కఠినంగా అమలు చేయనున్నారు.

# పారాక్వైట్ గడ్డి మందు అమ్మకాలపై నిషేధం

**తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**

**ప్రత్యామ్నాయ మందును వినియోగించాలని రైతులకు మంత్రి తుమ్మల సూచన**

**హైదరాబాద్, ఎప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 60 రోజుల పాటు పారాక్వైట్ గడ్డిమందు అమ్మకాలు, నిల్వలు, వినియోగంపై నిషేధం విధించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు ఉల్లఘించి పారాక్వైట్ మందు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో పారాక్వైట్ గడ్డి మందు నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర సర్కార్ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ 24 ఎల్ఎస్ అనే ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కాగా.. గడ్డి మందుపై నిషేధం విధించిన అంశంపై మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతోందని పేర్కొన్నారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాల్లో పారాక్వాట్ పై నిషేధం లేదా కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. పారాక్వాట్ కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డి మందులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసిందన్నారు.

## 15 నుంచి రైతు భరోసా జమ

**హైదరాబాద్, ఎప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ భారీ శుభవార్త అందించింది. రైతు భరోసా పథకంపై కీలక ప్రకటన చేసింది. రేవంత్ ప్రభుత్వం ఇటీవల యాసంగి సీజన్‌కు సంబంధించిన తొలి విడత రైతు భరోసా నిధులను విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలి విడతగా లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాల్లో రూ.6 వేల చొప్పున తొలి ఎకరానికి జమ చేసింది. కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్ బుక్‌లు పొందిన రైతులకు కూడా రైతు భరోసా అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరికి ఏప్రిల్ 15 నుండి నుంచి నిధులు జమ చేయాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పాస్‌బుక్ పొందిన 85 వేల మంది రైతులు ఉండగా వీరిలో 62 వేల మంది రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈ అన్నదాతలు రైతు భరోసాకు అర్హత కలిగి ఉన్నారా.. లేదా అనే విషయంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. అనంతరం నిర్ధారణ చేపట్టి లబ్ధిదారుల జాబితాలో చేర్చనుంది. 10 రోజుల్లో అర్హుల జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. అర్హత పొందినవారికి ఏప్రిల్ 15 నుంచి 20 తేది మధ్యలో రైతు భరోసా విడుదల చేయనున్నారు. యాసంగి సీజన్‌లో మొత్తం రూ.9 వేల కోట్లను రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన రైతులందరికీ ఈ సారి కూడా అందిస్తోంది. ఎవరికి ఎలాంటి కోతలు విధించలేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 69.39 లక్షల మంది రైతులకు రూ.8,744 కోట్లను విడుదల చేసింది. అప్పట్లో 9 రోజుల్లోనే రైతులందరి ఖాతాల్లో వేసింది. తొలి రోజు ఎకరం భూమి ఉన్న రైతులకు మొదలుపెట్టి 9 రోజుల్లో అందరికీ జమ చేసింది. అయితే ఈ సారి నిధుల విడుదలకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను పాటిస్తోంది. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా తొలి ఎకరానికి తొలి విడతలో జమ చేసింది. దీంతో ఒకేసారి అందరికీ లబ్ధి చేకూరినట్లయింది.

## రాష్ట్ర వ్యాప్తంగా మూతబడిన చికెన్ షాపులు

**మార్జిన్ పెంచాలని యజమానుల డిమాండ్**

**వెన్‌కాబ్, స్నేహ తదితర చికెన్ కంపెనీల తీరుపై ఆగ్రహం**

**ఎల్‌బినగర్‌లో ఓ షాపు యజమానిపై చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆగ్రహం**

**రోడ్డుపైకి కోడిగుడ్డు ట్రేలు విసిరేసిన వైనం**

**హైదరాబాద్, ఎప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చికెన్ దుకాణాల యజమానులు సమ్మె బాట పట్టారు. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ బుధవారం నుండి నిరవధిక బంద్‌ను చేపట్టింది. దీంతో రాష్ట్రంలోని సుమారు 50 వేల చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. వెన్‌కాబ్, స్నేహ చికెన్ వంటి దిగ్గజ కంపెనీలు తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, మార్జిన్లు పెంచే వరకు వెనక్కి తగ్గేదే లేదని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. గతంలో కిలో చికెన్ విక్రయంపై రూ.26గా ఉన్న మార్జిన్‌ను యాజమాన్యాలు ఇటీవల రూ.10కి తగ్గించడంతో చికెన్ షాపుల అసోసియేషన్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమకు గిట్టుబాటు కావడం లేదని, కిలో చికెన్‌పై మార్జిన్‌ను రూ.40కి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా బంద్ కొనసాగుతున్నప్పటికీ కొన్ని స్నేహ చికెన్ అవుట్ లెట్స్ మాత్రం తెరుచుకోవడం ఉత్కంఠకు దారితీసింది. దీనిని నిరసిస్తూ నేరెడ్‌మెట్ నుంచి మల్కాజ్‌గిరి వరకు ఉన్న అవుట్ లెట్స్ ముందు అసోసియేషన్ సభ్యులు ధర్నాకు దిగారు. అయితే ఈ బంద్‌కు మద్దతు తెలపకుండా హైదరాబాద్‌లోని ఎల్‌బినగర్‌లో ఒక యజమాని తన దుకాణాన్ని తెరవడం వివాదానికి దారితీసింది. విషయం తెలుసుకున్న ఇతర దుకాణదారులు అక్కడికి చేరుకుని నిలదీయడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ చికెన్ షాప్ యజమానితో అసోసియేషన్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. బంద్ వేళ చికెన్ షాప్ ఎలా తెరుస్తావవంటూ గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట నెలకొంది. అసోసియేషన్ సభ్యులు కోడిగుడ్ల ట్రేలను రోడ్డుపై పడేశారు. అటు ఓనర్‌పైనా దాడి జరిగినట్లు తెలుస్తోంది. కాగా.. ఒక్క హైదరాబాద్‌లోనే 25 వేల వరకూ చికెన్ షాప్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మొత్తం షాపుల నుంచే రోజూ 18 నుంచి 20 లక్షల కేజీల చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ మూత బడడంతో భారీ మొత్తంలో చికెన్ నిల్వలు మిగిలిపోనున్నాయి.


వార్త

మాటకు మాట ప్రతీకారం కాదు
మౌనమే దానికి సమాధానం.

న- ప్లినీ

# చల్లారని మంటలు

పశ్చిమాసియా యుద్ధమేఘాలు ఆకాశాన్నంటుతున్నాయి. యుద్ధంలో ప్రధానపక్షాలు, వాటి మిత్ర దేశాలు సైతం మంటల్లో మాడి మసైపోతున్నాయి. యుద్ధం గగనతలం నుంచి భూతలం మీదకు చేరుకోగానే గల్ఫ్ దేశాల్లో భయాందోళనలు వెల్లువెత్తాయి. ఉభయ పక్షాలు ఎవరికి వారే వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని భీష్మించుకు కూర్చున్నాయి. యుద్ధపక్షాలు ఒకరి ఆర్థిక మూలాలపై మరొకరు దెబ్బకొట్టే వ్యూహాల్లోనే ఉన్నారు. యుద్ధ సన్నాహాల్లో అనిశ్చితి అంటూ ఏమీలేదు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూనే ఉన్నారు. శ్వేత సౌధాధినేత ట్రంప్ వాగాడంబరం బాగా ఎక్కువైంది. ఆయన ఎన్ని వ్యాఖ్యానాలు చేసినా ఎవరూ నమ్మలేని పరిస్థితి. ఒకానొక సమయంలో ట్రంప్ వెనుకడుగు వేసినా అసలు సిసలు ఈ యుద్ధానికి ప్రోది చేసినా ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మాత్రం ససేమిరా అన్నారు. మళ్లీ ట్రంప్ రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇరాన్‌లోని చమురు నిల్వలకు, ఆ దేశ వాణిజ్యానికి గుండెకాయవంటి 'ఖర్గ్' ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకోగలిగింది. ముందుగా యుద్ధానికి తాత్కాలిక విరమణ అనగానే ట్రంప్ మాటలను ఎవరూ పట్టించుకోలేదు. ప్రత్యర్థి పక్షాలను శాంతింప చేసినట్లు చెబుతూనే ఒక్కసారిగా దాడిచేయటం యుద్ధ ప్రక్రియలో ఒక భాగమే. అమెరికా ఆయుధ సంపత్తి, ఇజ్రాయెల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన అధునాతన ఆయుధాలతో పోల్చిచూస్తే ఇరాన్ ఆయుధ సంపత్తి, సైనిక దళాలు, డ్రోన్‌లు వంటి ఎన్ని ఆయుధాలున్నా తక్కువే. అయినా ఇరాన్ తుదకంటూ పోరాడాలన్న లక్ష్యం పెట్టుకోవడం విశేషం. నెలరోజులు దాటిన ఈ యుద్ధంలో ఇరాన్‌కు అపార ప్రాణనష్టం, ఆర్థిక నష్టం చేకూరింది. అయినా ఎక్కడా వెనుకడుగు వేయలేదు. అమెరికా, సైనిక, వైమానిక స్థావరాల లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తూ అమెరికా అవాక్స్ విమానాన్ని ధ్వంసం చేయగలగడం ఎవరూ ఊహించని పరిణామం. దాంతో అమెరికా పాలకుల్లో కాస్తంత ఉలికిపాటుకు గురయ్యారు. ఈ ఒక్క విమానం ధ్వంసం కావడం వల్ల అమెరికాకు 6వేల కోట్ల నష్టం వాటిల్లింది. యుద్ధ పర్యవసానంగా ఇరాన్ సైన్యం 2వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రోజురోజుకీ యుద్ధ పరిణామాలు మారిపోతున్నాయి. వివిధ గల్ఫ్‌దేశాలు ఇరాన్ దెబ్బకు బెంబేలెత్తిపోయాయి. అమెరికాతో ఉన్నందుకు పునరాలోచనలో పడ్డాయి. అమెరికా దుందుడుకు చర్యలను ఆదేశ వాసులే వ్యతిరేకిస్తున్నారు. ఎనలిస్టులు సైతం ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా కూడా పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోందని విశ్లేషిస్తున్నారు. ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకోవడానికి జరిగిన ప్రయత్న సమయంలోనే ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హౌతీలు యుద్ధ రంగంలోకి ప్రవేశించారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణితో దాడిచేశారు. ఇజ్రాయెల్‌లోని సున్నితసైనిక స్థావరాలే లక్ష్యంగా హౌతీదాడులు పెరిగిపోతున్నాయి. హౌతీల ప్రవేశం నిర్ణయాత్మక మలుపుగానే యుద్ధ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ ఇజ్రాయెల్‌ల మధ్య ఉద్రిక్తతలు ఆపడానికి తెరవెనుక కొన్ని దేశాలు మధ్యేమార్గంగా కొన్ని చర్యలు చేపట్టారు. నోటికొచ్చినట్లు యుద్ధ అంశాల్నిప్రస్తావిస్తూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు యుద్ధ వాతావరణంపై ఉపశమనం కలిగించేటట్లు కాక ఉద్రిక్తతలు పెంచే స్థాయిలో ఉన్నాయి. అలా అని ట్రంప్ వాక్ స్వాతంత్ర్యంపై ఎవరూ వ్యాఖ్యానించేందుకు సిద్ధంగా లేరు. నాటో, యూరో పియన్ దేశాలు సైతం ట్రంప్‌నిర్ణయాలకు బాసటగా నిలిచే స్థాయిలో యోచించట్లేదు. తన ఆధీనంలో ఉన్న హార్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్త చమురు రవాణాకు పెద్ద ఆటంకమేర్పడ్డోంది. చమురు సంక్షోభం ఏర్పడి ఇబ్బంది పడుతున్న అన్ని దేశాలు అమెరికా నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నాయి. అయినా పెద్దగా మాట్లాడలేకపోతున్నాయి. ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడమే అమెరికా లక్ష్యం. ఏప్రిల్ 6వ తేదీలోగా తమ షరతులకు అంగీకరించకుంటే ఇరాన్ చమురు మౌలిక వనరులపై దాడులు తప్పవని అమెరికా హెచ్చరిస్తోంది. ఉభయపక్షాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణను ఇరాన్ కోరినందు వల్లనే తాము దయతో అంగీకరించామన్న ధోరణిలో ట్రంప్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలన్నీ ప్రపంచవ్యాప్త జనాన్ని గందరగోళ పరచడానికే. ఇటీవలనే గల్ఫ్ దేశాలు తమ ఇంధన వనరులపై ఇరాన్ దాడులను వ్యతిరేకిస్తూ అమెరికా పంచన చేరాయి. అంతే గల్ఫ్‌దేశాలు తమ భద్రతకు అమెరికా బాసటగా ఉంటాయన్న నమ్మకంతో ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ తొలుత ప్రకటించినట్లు వారిఅన్వేషణ, యుద్ధ ప్రేరేపణలకు కారణం ఇరాన్‌లోని అణుకేంద్రాల నుంచి సుమారు 450 కిలోల శుద్ధి చేసిన యురేనియంను స్వాధీన చేసుకోవడం కోసమే. వాటి స్వాధీనం కోసం అమెరికా సైనిక చర్యకు దిగుతుందని భావిస్తున్నారు. ఈ చర్య యుద్ధ జ్వాలలు మరింత ఎగిసిపడే స్థాయికి చేరుకోవచ్చు. ఇరాన్ తాము అణ్వాయుధాలు తయారీకి ప్రయత్నించటం లేదని, అలాంటి కార్యక్రమమేదీ తమ వద్దలేదని స్పష్టం చేసినప్పటికీ అమెరికా, ఇజ్రాయెల్‌లు నమ్మడంలేదు. ఏదో అనుమానం ఆవహించి ఇరాన్‌పై చర్యలు వేగవంతం చేయాలని ప్రయత్నిస్తోంది. యుఎస్, ఇజ్రాయెల్ తెరవెనుక వ్యూహాల్లో ఇరాన్ నుంచి యురేనియం స్వాధీన మొక్కటేచర్చల్లో ఉందనిపిస్తోంది. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధించాలన్న ఏకైక లక్ష్యమే ఈ యుద్ధానికి నేపథ్యమని తెలిసిందే. దీనిపై అమెరికా మరింత తీవ్ర నిర్ణయం తీసుకుంటే యుద్ధం మరో కోణంలోకి మారిపోయే అవకాశముంది.



పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.

ఆస్కార్ వైల్డ్



ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయలేరు.

జార్జి ఇలియట్

# ప్రజావాక్కు



### కుల,మతరహిత సమాజం కావాలి

ఏప్రిల్ ఒకటినుండి దేశవ్యాప్తంగా సెన్సస్2027 ప్రారంభం అవుతుందని కేంద్రం ప్రకటించింది. అందులో 33 ప్రశ్నావళి తో ఇంటింటికి వెళ్ళి సమాచారం సేకరిస్తారు అనికూడా ప్రకటించింది. సహజీవనం చేసేవారికి హోదా కల్పిస్తామని కూడాప్రకటించింది. సహజీవనమంటే యేమిటో చేప్పాలి. ఈసేకరణ కుల, మత సంఘాలను పెంచే విధంగా ఉండరాదు. మనది సెక్యులర్ దేశం. అందుకు అనుగుణంగా పరిపాలన ఉండాలి. కులసంఘాలను, మత సంఘాలను పెంచేవిధంగా ఈసెన్సెస్ ఉండరాదు. ఈ రోజుప్రపంచవ్యాప్తంగా పదిదేశాలలో కులమతరహితులుగా 70శాతం ఉన్నారు. చైనా, జపాన్, నార్వే, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటిదేశాలలో ఎక్కువగా ఉన్నారు. కుల మత రహిత సమాజం చాలా ఉన్నత విలువలు కలిగిన సమాజంగా గుర్తింపుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎవరి జీవితం వారి చేతుల్లోనే..

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల భారిన పడుతున్నారు. పాతకాలం రోజులేబాగుండే అని. తాతముత్తాతలను గుర్తు చేసుకొంటున్నారు. కానీమారిన జీవనశైలిని మార్చుకొనేందుకుఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమతగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిరుప్రాయంలోనే ప్రాణాంతకమైన జబ్బులతో అకాల మరణం పాలు చేస్తున్నాయి. మనం చేస్తున్న తప్పులను ఎవరైనా సరిదిద్దుకొమ్మని చెప్పినా వినే స్థితిలో లేము.

- డా.తండు మురళీ మోహన్, హైద్రాబాద్

### ఓటర్ రైట్స్ యాక్ట్ తీసుకురావాలి

వినియోగదారుల హక్కులు వాలేనే 100 రూపాయలు చెల్లిస్తే డబ్బుకు రసీదు ఇవ్వాలి. నాణ్యత లేకుంటే వారంటీ కింద రిపేరీ, గ్యారెంటీ కింద రీప్లేస్మెంట్ ఇవ్వాల్సి ఉందే కానీ ఇప్పుడు మేమడుగుతున్నది ఓటర్ హక్కుల గురించి ఓటుకు రసీదు కావాలి. హామీల అమలుకు గ్యారెంటీ కావాలి. గెలిచిన అభ్యర్థి ప్రజలకు సేవ చెయ్యనిచో వారిని రీప్లేస్మెంట్ వారంటీ ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలి లేనిచో రికల్ చెయ్యాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### జూదగాళ్లుగా మారుతున్న యువత

భారతదేశ ఆర్థిక ముఖచిత్రం గతకొన్ని ఏళ్ళలో గణనీయమైన మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ పరిమిత వర్గాలకే సాధ్యమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల స్మార్ట్‌ఫోన్ ఉన్నప్రతిఒక్కరూ పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం సానుకూల అంశమే అయినప్పటికీ, వాటా వ్యాపారం గంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధోరణి వల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణ లాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. ఆధునిక డిజిటల్ వేదికలుపెట్టుబడి ప్రక్రియను ఒక వీడియో క్రీడ ఆడినంత సులభంగా మార్చేశాయి. రంగు రంగుల రేఖాచిత్రాలు, ఆకర్షణీయమైన రూపకల్పనలు వినియోగదారుని నిర్ణయాత్మక శక్తిని ప్రభావితం చేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సోలార్ విద్యుత్‌పై దృష్టి

భారతదేశం ఇంటర్నేషనల్ సోలార్ అలియాన్స్‌ను ప్రతిపాదించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో విద్యుత్ అందించడం అది కుడాతిరిగి రూపొందించగలిగే లేదాతిరిగి పొందగలిగే రూపంలోనిది కావడం. ఫాసిల్ ఫ్యూయల్ కాకుండా తిరిగి పొందగలిగే వనరుల నుండి విద్యుత్ తయారు చేయడంముఖ్యం. అంత మాత్రమేకాదు భూమిమీద వేడి పెరగడం కాలుష్య కాసారాలుగా నగరాలు మారడం గమనించవచ్చు. దానికి ఢిల్లీ ఒక ప్రత్యక్షఉదాహరణ. ఇలా మారడానికి కారణం ఏమిటి అని ఆలోచించకుండా ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు ఉదాహరణకు అమెరికా వంటి దేశాలు బాధ్యతరాహితంగా మారడం గమనించవచ్చు. ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు బాధ్యతగా ఆలోచించాలి.

- భారత అవినాష్ ,జనగామ

### గ్రామసభలు నిర్వహించాలి

తొంభైతొమ్మిది రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 12.769 గ్రామాలలో వికలాంగుల గ్రామసభలు నిర్వహించాలి. ఈ సభలో 2016 వికలాంగుల చట్టం గురించి వికలాంగులకు అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. వికలాంగుల భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, వారిపై దాడులు, దౌర్జన్యాలు, వివక్షత చూపిన వారిపై వికలాంగుల చట్టం ప్రకారం శిక్షి ంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అమెరికాపై సన్నగిల్లుతున్న అరబ్ ఆశలు

**ఇరాన్ అత్యున్నత నాయకుడితోపాటు ముఖ్యమైన సైనిక, ఇతర నేతలు మృతిచెందినప్పటికీ అక్కడ అంతర్యుద్ధం రాలేదు, ప్రభుత్వం పడిపోలేదు. తక్కువ సమయంలోనే లొంగదీసుకోవచ్చు అనుకున్న అమెరికా ఇజ్రాయిల్ ఆలోచనలను తుత్తునియాలు చేస్తూ ఇక్కడ ఇరాన్ దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధపడ్డది అంటేయుద్ధాన్ని మొదలు పెట్టడం అమెరికా వంతైతే దాన్ని ముగించడం ఇరాన్ చేతుల్లోకి వెళ్లిపోయిందన్నమాట. జలసంధిపై ఇరాన్‌కు పట్టుండడంవలన చమురునౌకల రాకపోకలపై నియంత్రణలు విధించి ప్రపంచ చమురు అవసరాలకు అంతరాయం కలిగిస్తున్నది. ఫలితంగా చమురుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరైన చమురు అందుబాటులో లేక రోజురోజుకు రవాణా కష్టతరమైపోతున్నది. యుద్ధం ఎన్నటికీ పరిష్కారం కాదు. చర్చలేపరిష్కారం కాబట్టి యుద్ధంలో ఉన్నదేశాలు సంయమనం పాటించి చర్చించుకొని పరిష్కరించుకుంటే మేలు.**

డా.కావలి చెన్నయ్య

పశ్చిమాసియా లేదా మధ్య ప్రాచ్యంలో మారణ హోమం మొదలై సుమారు నెల కావొస్తుంది అంతం మెప్పుడనేది అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న! అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ, ఇజ్రాయిల్ ఆపరేషన్ రోరింగ్ లయన్ పేర్లతో ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ సంయుక్తంగా దాడి చేసి ఇరాన్ అత్యున్నత నేతఆయతుల్లా అలీ ఖోమైని, ఇతర ముఖ్యమైన నాయకులు, సైనికాధికారులను దారుణంగా హతమార్చింది. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం విస్తృత ప్రాంతీయ సంఘర్షణగా మారి ఎంతో మంది ప్రాణాలను, ఆస్తులను హరించి వేస్తున్నది. గల్ఫ్ దేశాలు(పర్షియన్ పరివాహక ప్రాంతంలో ఉన్న దేశాలు గల్ఫ్ దేశాలు సౌదీ అరేబియా, ఖతర్, బహ్రెన్, ఒమన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లు)అమెరికాకు సహాయం అందిస్తున్నాయని ఇరాన్ క్షిపణులను గల్ఫ్ పైకి ప్రయోగిస్తుంది అక్కడున్న అమెరికా సైనిక స్థావరాలే కాక పౌర ప్రాంతాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, చమురు కేంద్రాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, నీటి శుద్ధి కేంద్రాలు, పరిపాలన కార్యాలయాలు, సామాన్య ప్రజలు కూడా సమిధలవుతున్నారు. గల్ఫ్ దేశాలకు, వాటికి దగ్గరగా ఉండే ఇరాన్, ఇరాక్, సిరియా, లిబియా లాంటి ముస్లిం దేశాలకు జీవనాడి చమురు, సహజవాయువులు. ఇరాన్ దాడులను అరబ్, పశ్చిమ దేశాలు తీవ్రంగా ఖండిస్తూ తీవ్రమవుతున్న సంక్షోభాన్ని అరికట్టే మార్గాల అన్వేషణ చేస్తూనే గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్(జిసిసి)కి చెందిన మంత్రులు ఒక అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం జరుగుతున్న దాడుల వలన తాము సామూహిక ఆత్మ రక్షణ చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున స్థాయిని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు గల్ఫ్ దేశాలు ఇరాన్పై ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోనప్పటికీ ఈ దాడులవల్ల ఆ ప్రాంతాలలో పౌరులకు, కీలకమైన మౌలిక సదుపాయాలకు జరుగుతున్న నష్టాలు కారణంగా ఆ దేశాలు సైతం ఈ ఘర్షణలో ఇరుకపోవాల్సి వస్తుందని బహరేన్‌కు చెందిన దేరాసప్ సెంటర్ విశ్లేషించింది. గల్ఫ్‌లో జరుగుతున్న పరిణామాల పరిశీలన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 క్రింద కఠినమైన అంతర్జాతీయ జవాబుదారీతనం ఉండి తీరాలని డిమాండ్ తెరపైకి వస్తుంది. రోజురోజుకు యుద్ధం ముదిరి ఇరాన్ చేస్తున్న ఎడతెరిపిలేని దాడుల వల్ల గల్ఫ్ ప్రాంత దేశాలు అమెరికాతో ఉన్న తమ భద్రత సంబంధాలను పున పరిశీలించుకునేలా ఆలోచిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో వారి వ్యూహాత్మక భాగస్వామ్య స్వరూపాన్ని, వారి రక్షణ వ్యూహాలను పరిరక్షించుకోవడానికి పూనుకునే అవకాశాలు ఉన్నాయి. 1930-40ల మధ్య అమెరికా గల్ఫ్ దేశాల మధ్య రక్షణపరమైన వ్యూహాత్మక, దౌత్య సంబంధాలు చమురు అన్వేషణకోసం మొదలై 1945లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి రుజ్‌వెల్ట్ సౌదీ అరేబియా రాజు అబ్దుల్ అజీజ్‌ల భేటీ, చమురు భద్రతా ఒప్పందాలతో బాగా బలపడ్డాయి. 1990-91 నాటి గల్ఫ్ యుద్ధం/ కువైట్‌పై ఇరాక్ దురాక్రమణ (ఆపరేషన్ డెసర్ట్ స్టార్మ్) పర్యవసరంగా సైనిక పరంగా మరింత దగ్గర కావడం చేత గల్ఫ్‌దేశాల భద్రతకు అమెరికా పెద్దపీటవేసి అక్కడ 8 శాశ్వత సైనిక స్థావరాలతో పాటు, 11 కీలకమైన ఇతర సైనిక మండలాలను అంటే మొత్తంగా 19పైగా సైనిక సంబంధిత స్థావరాలు సౌదీ అరేబియా, ఖతర్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ల ప్రాంతీయ రక్షణ, తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం నెలకొల్పింది. కానీ ప్రస్తుతం గల్ఫ్‌లో



ఇరాన్ దాడి చేస్తుండడం వల్ల అమెరికాపై గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ వైఖరిలో భిన్నమైన మార్పులు వస్తున్నాయి. ఇరాన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి హార్మూజ్ జలసంధి సంక్షోభం తలెత్తకుండా చూడాలని గల్ఫ్ దేశాలు అమెరికాపై ఒత్తిడి తెచ్చాయి. మరో విశ్లేషణ ప్రకారం ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడిచేయడం వలన ఇరాన్ గల్ఫ్‌పై దాడులు మొదలు పెట్టిందనే విషయాన్ని అమెరికా విస్మరిస్తుందని ఆరోపణలు వస్తున్నాయి. ఇన్నాళ్లు గల్ఫ్‌దేశాలు అమెరికా కల్పించే భద్రతను నమ్ముకొని ఉన్నాయి అని ప్రస్తుత యుద్ధం ఆ దృక్పథాన్ని మార్చి వేసిందని చెప్పవచ్చు. గల్ఫ్‌దేశాల వ్యూహాత్మక ఆలోచనలో మార్పు వచ్చి గల్ఫ్ రక్షణ కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేయవచ్చు. ఫలితంగా అమెరికా గల్ఫ్ సంబంధాలు దెబ్బతిని అమెరికా ప్రయోజనాలకు గండిపడవచ్చు. ప్రస్తుత సంక్షోభం నుంచి నేర్చుకోవలసిన అంశాల గురించి చర్చకోసం మార్చి 16వ తేదీన అరబిక్ పాడ్కాస్ట్ 'ఎహతా'లో చర్చించారు. ఇరాన్, గల్ఫ్‌లోని అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకోవడం వలన గల్ఫ్ దేశాల భద్రత బలహీన పడిందని, ఇక్కడ తమకు ఖర్చుతో కూడుకున్న అమెరికా సైనిక స్థావరాలు ఉన్నప్పటికీ రక్షణ కరువైందని, అమెరికా దుందుడుకు వైఖరి వల్ల తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందని, అమెరికా ఉద్రిక్తతలను మరింతగా పెంచుతున్నదని, ఇరాన్ తమపై నిరంతరాయంగా దాడులు చేస్తూనే ఉన్నదని, అమెరికా పట్టించుకోవడంలేదని, ఇది గల్ఫ్‌లోని ప్రజలకు అమెరికా నమ్మక ద్రోహం/ మోసం చేస్తుందనే భావనను రేకిత్తిస్తున్నది. అమెరికా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇరాన్‌దాడుల వల్ల గల్ఫ్ దేశాలను ప్రమాదంలోకి నెట్టివేస్తుందని భావిస్తున్నప్పటికీ ఇప్పటికిప్పుడు అమెరికాతో భద్రతా భాగస్వామ్యాన్ని వదులుకోలేవు. మరో పక్క అమెరికావల్ల నిరాశ చెంది చైనా, రష్యా వైపు కొత్త భాగస్వామ్యం కోసం ఆలోచిస్తున్నప్పటికీ అది ఆచరణ సాధ్యం కాకపోవచ్చని ఎహతాలో జరిగిన పాడ్కాస్ట్ సమావేశంలో చర్చించిన నిపుణులు చెప్పారు. అయినప్పటికీ గల్ఫ్ దేశాలకు అమెరికాతో ఉన్న భద్రత భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే ప్రాంతీయ రక్షణ, దౌత్య స్వయం ప్రతిపత్తిని అభివృద్ధి చేయాలని గల్ఫ్ దేశాలు ఆలోచిస్తున్నాయి. ఒకవేళ ఈ యుద్ధం ముగిసిన తర్వాత కూడా గల్ఫ్‌దేశాలు అమెరికాతో ఉన్నరక్షణాత్మక, దౌత్యపరమైన సంబంధాలను వదులుకోవడానికి సిద్ధంగా లేవని ఈ మధ్యనే ఖతార్ అల్ జజీరా టీవీలో ఒక చర్చ జరిగింది. కానీ ఈ పరిణామాలన్నీ గల్ఫ్ దేశాలను ఏదో ఒక ముందుఅడుగు వేయడానికి పురిగొల్పుతాయని అనడంలో సందేహంలేదు. మరోపక్క అమెరికా అందించే రక్షణతో పాటు యూరోప్లో బలమైన దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలతో గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ కు ఉన్న విస్తృతమైన సంబంధాలు పునసమీక్షించుకునేందుకు దారితీస్తుంది. ఎందుకంటే ఈ యుద్ధసమయంలో తమ పై దాడి జరుగుతుంటే ఏఒప్పందం పనికిరాకుండా పోయిందనే భావన. గల్ఫ్‌దేశాలే ఇరాన్‌పై దాడిచేయాలని ప్రేరేపించాయని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సౌదీ అరేబియా విషయంలో ఇది నిజమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. నిజానికి ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడుల వల్ల ఖోమేని నిరంకుశ ప్రభుత్వం పోయి తమకు అనుకూలమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడుతుందని ఇటు గల్ఫ్‌దేశాలు, అమెరికా, ఇజ్రాయిల్‌లుభావించాయి. కానీ ఈ యుద్ధం ఇరాన్ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందని చెప్పవచ్చు. ఇరాన్ అత్యున్నత నాయకుడితోపాటుముఖ్యమైన సైనిక, ఇతర నేతలు మృతిచెందినప్పటికీ అక్కడ అంతర్యుద్ధం రాలేదు, ప్రభుత్వం పడిపోలేదు. తక్కువ సమయంలోనే లొంగదీసుకోవచ్చు అనుకున్న అమెరికా ఇజ్రాయిల్ ఆలోచనలను తుత్తునియాలు చేస్తూ ఇక్కడ ఇరాన్ దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధపడ్డది అంటేయుద్ధాన్ని మొదలు పెట్టడం అమెరికా వంతైతే దాన్నిముగించడం ఇరాన్ చేతుల్లోకి వెళ్లిపోయిందన్నమాట. జలసంధిపై ఇరాన్‌కుపట్టుండ డంవలన చమురునౌకల రాకపోకలపై నియంత్రణలువిధించి ప్రపంచ చమురు అవసరాలకు అంతరాయం కలిగిస్తున్నది. ఫలితంగా చమురుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరైన చమురు అందుబాటులో లేక రోజురోజుకురవాణా కష్టతరమైపోతున్నది. యుద్ధం ఎన్నటికీ పరిష్కారం కాదు. చర్చలేపరిష్కారం కాబట్టి యుద్ధంలో ఉన్నదేశాలు సంయమనం పాటించి చర్చించుకొని పరిష్కరించుకుంటే మేలు.

# యుద్ధ సెగలతో కములుతున్న సాగు

ఇ. శ్రీనివాస్ రావు

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ సెగలు.. వేల మైళ్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్షిపణుల మోతలు ఇరాన్, ఇజ్రాయెల్ సరిహద్దుల్లో వినిపిస్తున్నా వాటి వల్ల పెరిగే ఎరువులు, ఇంధన ధరల మోత మాత్రం మన రైతుల జేబుల్లో మోగుతోంది. ఇది కేవలం భౌగోళిక లేదా రాజకీయ సంక్షోభం మాత్రమే కాదు, మన దేశ వ్యవసాయ రంగాన్ని, ఆహార భద్రతను కుదిపేసే పరిణామం. వ్యవసాయం అత్యంత సున్నితమైన రంగం. ప్రపంచవ్యాప్తంగా యూరియా, ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల తయారీకి అవసరమైన సహజ వాయువు సరఫరాలో పశ్చిమాసియా దేశాలదే కీలకపాత్ర. యుద్ధ ఉద్రిక్తతల వల్ల సరఫరా చైన్ దెబ్బతిని, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. దీనికి తోడు వ్యవసాయం పూర్తిగా డీజిల్‌పైనే (ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా) ఆధారపడి ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే, ఆభారం నేరుగా డీజిల్ రూపంలో సాగు ఖర్చును అమాంతం పెంచుతుంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేసే రైతులకు పెట్టుబడి వ్యయం తడిసి మోపెడవుతున్నా.. దానికి తగ్గ గిట్టుబాటు ధర దక్కకపోవడం వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది. పశ్చిమాసియా యుద్ధంతో వాణిజ్య రవాణాకు కీలకమైన ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి మార్గాల్లో కల్లోలం నెలకొంది. దీనివల్ల నౌకా రవాణా, బీమా ఖర్చులు భారీగా పెరిగాయి. దీని



ప్రత్యక్ష ప్రభావం తెలుగు రాష్ట్రాల ఎగుమతులపై పడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి ఇరాన్, తదితర గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే బియ్యం, మిర్చి, రొయ్యల (ఆక్వా) రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎగుమతులు మందగిస్తే వేలాది మంది రైతులు, మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుంది. అయితే, ప్రతి సంక్షోభం ఒక అవకాశాన్ని కూడా మోసుకొస్తుంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్న నేపథ్యంలో, ఇతర దేశాలు తమ అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు చూస్తాయి. మన బియ్యం, పప్పుధాన్యాలు, మసాలా దినుసులకు గ్లోబల్ మార్కెట్లో కొత్త డిమాండ్ సృష్టించుకోవడానికి ఇదొక అవకాశం. సరైన వ్యూహంతో అడుగులు వేస్తే భారతీయ రైతులకు ఇది వరంగా మారే అవకాశం లేకపోలేదు. సాగు ఖర్చు పెరిగి రైతులు ఎరువుల వాడకం తగ్గిస్తే అది నేరుగా దిగుబడుల పతనానికి, తద్వారా దేశీయంగా ఆహార సంక్షోభానికి దారితీస్తుంది. ఈ ముప్పును ప్రభుత్వాలు ముందుగానే పసిగట్టాలి. ప్రత్యామ్నాయదేశాల నుంచి ఎరువుల దిగుమతికి మార్గాలు అన్వేషించడం, రైతులకు డీజిల్, ఎరువులపై సబ్సిడీల భారాన్ని ప్రభుత్వమే భరించడం తక్షణ కర్తవ్యం. అలాగే ఎగుమతిదారులకు అండగా నిలిచి, నూతన మార్కెట్లను అభివృద్ధి చేయాలి. పశ్చిమాసియా సంక్షోభాన్ని కేవలం విదేశీ వ్యవహారాల కోణం లోనే కాకుండా, దేశీయ వ్యవసాయ, ఆర్థిక కోణంలో విశ్లేషించుకోవాలి. ఈ సంక్షోభాన్ని దీర్ఘకాలిక వ్యూహాలతో ఎదుర్కొవాల్సిన బాధ్యత ప్రభుత్వాలది.

# నియోజకవర్గాల పెంపు అవసరమా?

డాక్టర్ టి. సేవకుమార్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో లోక్ సభ స్థానాలను, రాష్ట్రాల శాసనసభలలో అసెంబ్లీ స్థానాలను, ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50శాతం పెంచాలని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ప్రతిపక్షాలు నియోజక వర్గాల పెంపుకు అంత తొందర ఎందుకని ప్రశ్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంకా స్పీడ్‌పెంచుతోంది. తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక పునర్విభజన చట్టాలున్నా, 2001లో రాజ్యాంగ సవరణద్వారా వాయిదా వేసిన ఈప్రక్రియ, ఈసంవత్సరం అంటే 2026లో జరగాల్సి ఉంది. కోవిడ్ కారణంగా 2021లో జనాభా లెక్కలు జరగకపోవటం, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదిక చూస్తే పెరగకపోగా, కొన్ని నియోజక వర్గాలు తగ్గిపోవటం తదితర కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. దక్షిణాది రాష్ట్రాల ఉనికి పార్లమెంట్‌లో తగ్గిపోతుందని ఆయా దక్షిణాది రాష్ట్రాలు బలంగా నిరసన వ్యక్తంచేయడంతో ఆ సమస్యను ఎలా సరిచేయాలనే విషయంలో చర్చలు కూడా జరుగుతున్నాయి. భిన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం హఠాత్తుగా నియోజవర్గ పునర్విభజన ప్రక్రియను తెరపైకి తెచ్చింది. పార్లమెంటులో లోక్‌సభ స్థానాలు, ఏప రాష్ట్రాలలో ఎన్ని అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి? మహిళల కోట, ఎస్సీ, ఎస్టీ కోటాలలో ఏమాత్రం పెరుగుతాయి? పెంపుదలకు రాజ్యాంగబద్ధ సవరణలు తదితర విషయాలను పక్కన పెడితే ప్రస్తుత దేశ, రాష్ట్రాలలో నెలకొని ఉన్న ఆర్థిక, సామాజిక, సాంఘిక పరిస్థితులలో అసలు ఈ నియోజకవర్గాల పెంపు అవసరమా?అన్న అంశాన్ని ఇక్కడ చర్చిద్దాం. మన రాజ్యాంగం, చట్టసభలకు ఎన్నుకోబడిన లోక్‌సభ సభ్యులు గాని, శాసనసభల సభ్యులుగాని ప్రజాహిత చట్టాలు చేయడమే వారి ప్రధాన విధిగా పేర్కొంది. ఆ చట్టాలను అమలు చేయడం బ్యూరోక్రాట్లు, అధికారులు పని. కానీ మనదేశంలో, రాష్ట్రాలలో జరుగుతున్నది ఏమిటి? ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన, చర్చించాల్సిన ప్రధాన విషయం ఇది. ఎన్నికల బూత్ స్థాయి నుండి రాష్ట్ర, కేంద్ర స్థాయివరకు ప్రతి చిన్న విషయంతో కలిపి అన్ని విషయాలలో ఎమ్మెల్యేల, ఎంపీల అనైతిక ప్రాబల్యం ఏ మేరకు పెరిగిపోయిందో అందరం చూస్తూనే ఉన్నాం. ఎమ్మెల్యే అన్న, ఎంపీ అన్న ఆ నియోజకవర్గంలో తామే సర్వం అనే భ్రమలను ప్రజలకు కల్పించారు. అంతేకాక అధికార పార్టీల అనుచరగణం కర్ర పెత్తనం అంతా ఇంతా కాదు. దీనివల్ల అధికార, ప్రతిపక్షాల మధ్య, ప్రజల మధ్య తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సమాజం, ప్రజలు పార్టీల పరంగా విడిపోక తప్పని పరిస్థితులు దాపురించాయి. దేశంలోని చాలా గ్రామాలలో కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోతున్నాయి. ఏదో ఒకపార్టీ సపోర్ట్ లేకపోతే కొన్ని గ్రామాలలో నివసించలేని పరిస్థితులు వచ్చాయంటే ప్రజాస్వామ్యం దేశంలో ఏస్థాయికి దిగజారిందో అర్థమవుతుంది. ఇదో అంశం అయితే, మరో అంశం చట్టసభలలో ప్రవేశించే వారి రాజకీయ, పాలన అనుభవం, రాజ్యాంగం, చట్టసభలు, చట్టాలు, సమాజ పరిస్థితులు తదితర విషయాలలో కనీస పరిజ్ఞానం ఏమిటో ఆలోచించాల్సిన అవసరం ఉంది. పార్టీలను, కులాలను, మతాలను చూసి డబ్బు, మద్యం ఇచ్చి మభ్యపెట్టే అభ్యర్థులను గెలిపిస్తున్నారు తప్ప వారిలో చట్టసభలో ఒక అంశంపై మాట్లాడే, చర్చించే శక్తి సామర్థ్యాలు చూసి గెలిపించడం లేదు. వ్యక్తిని చూసి ఓట్లు వేసే పరిస్థితి ఏనాడో పోయింది. నియోజక వర్గాలు పెరిగితే సభ్యుల సంఖ్య పెరగడం తప్ప, రాజ్యాంగం కల్పించిన లక్ష్యాలు ఏమాత్రం నెరవేరవు. అందులో ఎట్టిసందేహామూ అవసరం లేదు. ఇప్పుడు చట్టసభలలో ఏమి జరుగుతుందో అందరికీ తెలుసు. అధికార, ప్రతిపక్ష పార్టీలు వాగ్వివాదానికి దిగటం, ప్రతిపక్షం వాకౌట్ చేయడం, మూజువాణి ఓటుతో బిల్లులు ఆమోదించి, చట్టాలు చేయడం సర్వసాధారణమైపోతుంది. ఆ చట్టాలు కూడా చాలా సందర్భాలలో ప్రజాహితం కన్నా కూడా ఆయా పార్టీలకు అనుగుణంగా చేసుకోవడం జరుగుతుంది. దీనివల్ల ప్రజాస్వామ్య హననం జరుగుతుందితప్ప, రాజ్యాంగ బద్ధ, చట్ట పరిపాలన జరగటం లేదు. మరోవైపు అసలే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశంపై రాష్ట్రాలపై ఆర్థిక భారం బాగా పెరిగిపోతుంది. వారికి ఇచ్చే గౌరవ వేతనాలు, నివాస వసతి, అలవెన్స్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర మంది మార్బలం, తర్వాత జీవితకాలం ఇచ్చే పింఛన్లు వెరసి ప్రజాధనం ఎంతో వెచ్చిచ్చాల్సి ఉంటుంది. ఇక ఎన్నికల సమయంలో నియోజవర్గ స్థాయిలో ఓటర్ విలువ పెరిగిపోతుంది. గతంలో ఎంత డబ్బుఖర్చు పెట్టారో ఇప్పుడు గెలుపు కోసం ఓటర్లను తన వైపు తిప్పుకోవడం కోసం, ప్రసన్నం చేసుకోవడం కోసం మరింత ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఓటరులో స్వార్థపూరిత సొంత డిమాండ్లు పెరిగిపోతాయి. విద్వేషాలు మితిమీరుతాయి. గెలిచినవారు చట్టసభల్లో మాట్లాడటం మర్చిపోయి, ఆ బాధ్యతను గాలికి వదిలేసి ఖర్చుపెట్టిన దాన్నిసంపాదించుకోవడమే లక్ష్యంగా ఉంటుంది. ఇప్పుడు కూడా అదేజరుగుతోంది. ముున్ముందు ఇది ఇంకా బాగా పెరిగిపోతుంది. మనుషుల మధ్య ఆర్థిక, స్వార్థపూరిత లావాదేవీలే తప్ప మానవత్వం కనిపించదు. ఇప్పటికే కనిపించడం లేదుకూడా. ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు చట్టసభలలో గైర్ హాజరయ్యే వారు ఎక్కువగానే ఉంటున్నారు. అసలు హాజరైనచర్చల్లో పాల్గొన్నవారు తక్కువగానే ఉంటున్నారు. చట్టసభలు జరిగేటప్పుడుమాట్లాడదాం అనుకున్నా అందరికీ మాట్లాడే అవకాశాలు వస్తాయని చెప్పలేం. ఎమ్మెల్యేలు, ఎంపీలు సీట్లు పెరగడంవల్ల యువతకు, మహిళలకు చట్టసభల్లో ప్రవేశించే అవకాశాలుపెరుగుతాయి. చట్టసభల్లో ప్రవేశించాలి అనుకునే ఆశయంగలవారికి ఆనందం కలిగించవచ్చు. దేశానికి రాష్ట్రానికి ప్రయోజనం మాత్రం ఏమాత్రం ఉంటుందో ఆలోచించాల్సిన విషయం. చట్టసభలలో ఇప్పుడు ఏమి జరుగుతుందో అప్పుడు కూడా అదే జరుగుతుందని కచ్చితంగా చెప్పవచ్చు. కాబట్టి ప్రస్తుత దేశస్థాయిలో రాష్ట్రాలలో ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నియోజక వర్గాల పెంపు కొత్తవారికి అవకాశాలుకల్పించవచ్చు గాని ప్రజాహితం మాత్రంకాదు. రాజకీయ పార్టీలకులబ్ధి చేకూర్చవచ్చు గాని ప్రజలకు మాత్రంకాదు. నియోజకవర్గ పరిధిలో మార్పులు తప్పనిసరిగాని సంఖ్యపెంపు అవసరంలేదు. రాజకీయ పార్టీలలో అవకాశంరాని కొంతమంది ప్రధానకార్యకర్తలకు అవకాశం కల్పించడానికి ఉపయోగపడతాయి. ప్రస్తుతం దేశంలో జాతీయపార్టీలలోనైనా, రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల్లోనైనా గెలిచిన అభ్యర్థులు స్వేచ్ఛగా తన అభిప్రాయాలను చట్టసభల్లో వ్యక్తపరిచే పరిస్థితులు లేవు. ప్రతిపక్షానికి అవకాశాలురావు. వచ్చినా సరైన సమయం ఇవ్వరు. ఇచ్చిన అధికారపార్టీ సభ్యులు మాట్లాడనివ్వరు. ఇక అధికార పార్టీ లవారు చాలావరకు పార్టీ విధానాలు కట్టుబడి మాట్లాడాలే తప్ప తన సొంత అభిప్రాయాలను సూచనలను స్వయంగా మాట్లాడే అవకాశం లేదు. ఒకవేళ ఎవరైనా తెగించి మాట్లాడితేపై నేతల నుండి కౌన్సిలింగ్ తప్పదు. అందుకే చాలా మంది నోరు మెదపదానికే భయపడుతున్నారు.

# 'బరువెక్కిన'వాణిజ్య సిలిండర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల ప్రపంచ ముడి చమురు ధరలు దాదాపు 50 శాతం మేర పెరిగాయి. దీంతోపాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోయిన పరిస్థితుల్లో దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలకు రెక్కలొచ్చాయి. తాజాగా ప్రభుత్వరంగ చమురు సంస్థలు వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరతోపాటు ప్రీమియం పెట్రోల్, ప్రీమియం డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్), వాణిజ్య ఎల్పిజి ధరలలో గణనీయమైన మార్పులు చేశాయి. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.195.50 మేర పెంచాయి. ఈ పెంపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధరరూ.2,105.50కి చేరింది. ఢిల్లీలో రూ.2,078.50కి, కోల్‌కతాలో రూ. 2,208కి ఎగబాకింది. గత నెల, అంటే మార్చి 1వ తేదీన కూడా కమర్షియల్ సిలిండర్‌పై రూ. 114.5 పెంచిన విషయం తెలిసిందే. నెల తిరగే సరికి మరోసారి ధరలు పెరగడం గమనార్హం.





### రూ.195.50 పెరిగిన ధర
### ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు
### 114.5శాతం పెరిగిన జెట్ ఇంధనం ధర
### ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిర్ణయం

**జెట్ ఇంధనం ధరల మోత:** ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ఇంధనం ధరలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరగడంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.ఇవాళ జెట్ ఇంధనం ధర ఏకంగా 114.5 శాతం పెరిగి కిలోలీటర్‌కు రూ.2.07 లక్షలకు చేరింది. ఎటిఎఫ్ ధర రూ.2 లక్షల మార్కును దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల ప్రకటన ప్రకారం ఢిల్లీలో ఎటిఎఫ్ ధరకిలోలీటర్‌పై రూ.1,10,703 మేర పెరిగి రూ.2,07,341కి చేరింది. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో దాదాపు 40శాతం ఇంధనానికే ఖర్చవుతుంది. ఈ నేపథ్యంలో ఇంత భారీగా పెరిగిన ధరల భారాన్ని తట్టుకోవడం కంపెనీలకు అసాధ్యం. దీంతో ఈ భారాన్ని ప్రయాణికులపైకి బదిలీ చేసేందుకు విమానయాన సంస్థలు సిద్ధమవుతున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచడం మినహా వాటికి మరో మార్గం లేదని అధికారులు విశ్లేషిస్తున్నారు.

**ప్రీమియం ఇంధనాల ధరలు పెరిగాయి**

ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) ప్రీమియం ఇంధనాల ధరలను సవరించింది. దీంతో ఉన్నత శ్రేణి పెట్రోల్, డీజిల్ వేరియంట్ల ధరలు పెరిగాయి. ఐఓసి తన హైఆక్టేన్ ఎక్స్‌పి100 పెట్రోల్ ధరను ఢిల్లీలో లీటరుకు రూ.149 నుండి రూ.160కి పెంచింది. ఈ ప్రీమియం ఇంధనాన్ని సాధారణంగా లగ్జరీ వాహనాలు, అధిక పనితీరు గల మోటార్‌సైకిళ్లలో ఇంజిన్ సామర్థ్యం, పనితీరును మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. ఎక్స్‌ట్రా గ్రీన్ పేరుతో విక్రయించబడుతున్న ప్రీమియం డీజిల్ ధర కూడా పెరిగింది. దీని ధర లీటరుకు రూ.91.49 నుంచి రూ.92.99కు పెరిగింది.



## స్వర్ణ దేవాలయంలో ప్రియాంక చోప్రా సేవలు

అమృత్‌సర్,ఏప్రిల్ 1: స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆమె పర్యటనకు సంబంధించిన వార్తలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా అమృతసర్‌లోని ప్రఖ్యాత స్వర్ణ దేవాలయాన్ని (గోల్డెన్ టెంపుల్) సందర్శించుకున్న ప్రియాంక, అక్కడ ఆధ్యాత్మిక సేవలో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. గుడి ప్రాంగణంలో ఆమె స్వయంగా గిన్నెలు శుభ్రం చేస్తూ కనిపించారు. ఈ అరుదైన దృశ్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుత నెట్టింట చక్కర్లు కొడుతోంది. నిన్న మహవీర్ జయంతి సందర్భంగా ప్రియాంక స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. గులాబీ రంగు దుస్తులు ధరించి, తలపై దుపట్టా కప్పుకుని ఆమె ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సిక్కు మతంలో ఎంతో పవిత్రంగా భావించే సేవలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఉపయోగించే పాత్రలను ఆమె శ్రద్ధగా శుభ్రం చేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఒక సామాన్య భక్తురాలిగా ఆమె సేవలో నిమగ్నమవడం పలువురిని ఆకట్టుకుంటోంది. ప్రియాంక భారత్ పర్యటన వెనుక అసలు కారణం ఏమిటనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆమె తన సినిమా షూటింగ్ కోసమే ఇక్కడికి వచ్చారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## మంటల్లో పశ్చిమాసియా

### హార్ముజ్ కోసం భూతల దాడులకు అమెరికా సిద్ధం

వాషింగ్టన్,ఏప్రిల్ 1: మధ్యప్రాచ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా ఇరాన్‌పై భూతల దాడులు చేయడానికి సిద్ధంగా ఉంది. ఇరాన్ దిగ్బంధించిన హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఆపరేషన్ ప్రారంభించాలని చూస్తోంది. హార్ముజ్ జలసంధిని తెరవడానికి యూఏఈ, సౌదీ అరేబియాతో పాటు గల్ఫ్ లోని మిత్రదేశాలు అమెరికాకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై చర్యలు తీసుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం కోసం యూఏఈ లాబీయింగ్ చేస్తుందని చెప్పింది. ఈ జలసంధిని తెరవడానికి ఒక కూటమిని ఏర్పాటు చేయాలని అమెరికా, యూరప్, ఆసియాలోని సైనిక శక్తులను తమ దేశ దౌత్యవేత్తలు కోరినట్లు యూఏఈ అధికారులు చెప్పినట్లు ఆంగ్లమీడియా పేర్కొంది. అమెరికా సన్నిహిత మిత్రదేశం బహ్రెయిన్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేస్తున్నట్లు, గురువారం దీనిపై ఓటింగ్ జరగనున్నట్లు సమాచారం. గల్ఫ్ దేశాల ఆహారం, ఇతర ఎగుమతులు, దిగుమతులు ఈ హార్ముజ్ జలసంధిపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రపంచంలో 20 శాతం చమురు రవాణా ఈ మార్గం గుండనే జరుగుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ దాడి తర్వాత ఇరాన్ ఈ మార్గాన్ని కంట్రోల్ చేస్తోంది. నౌకలపై దాడులు చేస్తోంది. కొన్ని మిత్రదేశాలకు చెందిన నౌకల్ని మాత్రమే ఇరాన్ అనుమతిస్తోంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఈ యుద్ధంలో సౌదీ, యూఏఈ కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్‌ను ఎదుర్కోవడానికి గల్ఫ్ ప్రాంతంలోని ఇతర దేశాలతో కూటమి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెప్పారు. యూఏఈ యుద్ధంలో చేరబోతున్నట్లు వార్తలు వచ్చాయి. నేను అరబ్ నాయకులతో రహస్యంగా మాట్లాడాను, ఇరాన్‌కు అవకాశం వస్తే మిమ్మల్ని జయించి, మీ రాజ్యాలను కూల్చివేస్తుందని చెప్పాను అని నెతన్యాహూ చెప్పడం విశేషం.

## ఇరాన్ యుద్ధంలో బ్రిటన్ చేరేదిలేదు: ప్రధాని స్టార్మర్



వాషింగ్టన్,ఏప్రిల్ 1: బ్రిటన్, ఫ్రాన్స్ వంటి మిత్రదేశాలు, నాటో కూటమిలో సభ్యులు తనతో కలవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధంలో యూకే సహకరించడం లేదని మండిపడ్డారు. ఇకపై మీ చావు మీరు చావండి అంటూనే, నాటో కూటమి నుంచి వైదొల గాలని అమెరికా భావిస్తోంది. ఇలా భయపెడుతున్నా, ట్రంప్‌ను ధిక్కరిస్తూ బ్రిటన్ సంచలన వ్యాఖ్యలు చేయడంతో పాటు కీలక నిర్ణయం తీసుకుంది. తాము ఇరాన్ యుద్ధంలో చేరబోమని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తేల్చి చెప్పాడు. ఇదే కాకుండా ట్రంప్‌కు మరింత కోపం తెప్పించే విధంగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి గ్లోబల్ హార్ముజ్ సమ్మిట్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఇరాన్ యుద్ధం బ్రిటన్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్టార్మర్ హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. నాపైనా, ఇతరులపైనా ఎంత ఒత్తిడి వస్తున్నా, ఎంత గందరగోళం సృష్టిస్తున్నా, నా నిర్ణయాలన్నీ బ్రిటన్ పౌరుల శ్రేయస్సు కోసమే ఉంటాయి. అందువల్ల, ఇది మన యుద్ధం కాదని, మనం ఇందులో చిక్కుకోవాలని కోరుకోవడం లేదని స్పష్టం చేస్తున్నట్లు స్టార్మర్ చెప్పారు. మరోవైపు, త్వరలో యూరప్‌ను కూడా ఇరాన్ యుద్ధం ప్రభావితం చేస్తుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెచ్చరించింది.

## యుద్ధ ఉద్రిక్తతల్లో ప్రజల మధ్యకు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు

టెహ్రాన్, ఏప్రిల్ 2: ఇరాన్‌లో అరుదైన దృశ్యం కనిపించింది. దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఓ ర్యాలీలో నేరుగా ప్రజల మధ్యకు వచ్చారు. హత్యాయత్నాల ముప్పు పొంచి ఉన్నప్పటికీ, కనీస భద్రతా ఏర్పాట్లు కూడా లేకుండా వారు జనంతో కలిసిపోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ఇస్లామిక్ రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా టెహ్రాన్ వీధుల్లో జరిగిన ఈ ర్యాలీలో అధ్యక్షుడు పెజెష్కియాన్, మంత్రి అరాఘ్చీ ప్రజలతో మాట్లాడుతూ, సెల్ఫీలు దిగుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రజల మధ్యకు రావడం ద్వారా వారి నుంచి స్ఫూర్తి పొందడానికి, ఈ ఐక్యతను ఆస్వాదించడానికి వచ్చానని విదేశాంగ మంత్రి అరాఘ్చీ వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్, అమెరికా కలిసి ఆ దేశ ఉన్నత స్థాయి అధికారులను లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజానీ కూడా ఇలాగే బహిరంగంగా కనిపించిన కొన్ని రోజులకే అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. యూరోపియన్ కౌన్సిల్ అధిపతితో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ మాట్లాడారు. ఈ ఘర్షణకు ముగింపు పలికేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మళ్లీ ఇలాంటి దాడులు పునరావృతం కావనే గ్యారెంటీ ఇవ్వడం వంటి ప్రాథమిక షరతులను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతవారం అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికకు కౌంటర్‌గా ఇరాన్ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ శక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ నేతలను లక్ష్యంగా చేసుకుని హత్యలు కొనసాగిస్తే, గూగుల్, యాపిల్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలపై ప్రతీకార దాడులకు దిగుతామని ప్రకటించింది. దీంతో ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## మస్క్ స్టార్‌లింక్‌నూ టార్గెట్ చేస్తాం..

టెహ్రాన్, ఏప్రిల్ 1: అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. పొరుగు దేశాల్లోని అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులకు దిగుతామని, ఈ క్రమంలోనే ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థపై విరుచుకుపడతామని స్పష్టం చేసింది. బహ్రెయిన్, కువైట్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాల్లో స్టార్‌లింక్ కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో అక్కడి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇరాన్ దాడుల కారణంగా గల్ఫ్ దేశాల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లు సంభవిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పలు దేశాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఐఆర్‌జీసీఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న సుమారు 18 అమెరికా టెక్ కంపెనీల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ తెలిపింది. ఈరోజు నుంచి యాపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టెస్లా, బోయింగ్ వంటి ఇతర దిగ్గజ కంపెనీల యూనిట్లపై కూడా దాడులు చేసే అవకాశం ఉందని ఇరాన్ సైన్యం సంకేతాలిచ్చింది. ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రాణాలు కాపాడుకోవాలంటే తక్షణమే ఆ ప్రాంతాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఇరాన్‌లో ఇప్పటికే స్టార్‌లింక్‌పై నిషేధం అమల్లో ఉంది. ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నారు.

## నాటో కూటమి నుంచి వైదొలిగేందుకు ట్రంప్ యోచన



ఫ్లోరిడా,ఏప్రిల్ 1: నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్ సైనిక కూటమి నుంచి అమెరికా బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ మీడియాతో మాట్లాడుతూ నాటో నుంచి బయటకు వచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నాటో ఒక కాగితపులిగా మారిందని అన్నారు. నాటో విశ్వసనీయత గురించి తనకు ముందు నుంచి అనుమానాలు ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ట్రంప్‌కు నాటో మిత్రదేశాలు సహకరించలేదు. బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీతో పాటు పలు దేశాలు నాటో కూటమిలో ఉంటూ అమెరికా జరుపుతున్న ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పలు సందర్భాల్లో ట్రంప్ యూరప్ దేశాలు, నాటో దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తన ట్రూత్ సోషల్‌పోస్ట్‌లో ఘాటు వ్యాఖ్యలుచేశారు. ఈ యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సహకరించడం లేదని, ఇజ్రాయిల్ వైపు వెళ్తున్న తమ విమానాలకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇరాన్ దాడుల్లో అమెరికాకు సాయం చేయదని దేశాలను ఉద్దేశిస్తూ వెళ్లి మీరు చమురు తెచ్చుకోండి అంటూ హెచ్చరించారు.ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని నిర్మూలించే చర్యలో పాల్గొనడానికి నిరాకరించిన దేశాలు తమకు కావాల్సిన చమురును అమెరికా నుంచి కొనుగోలు చేయాలని లేదా హార్ముజ్ జలసంధి గుండా వెళ్లి చమురు తెచ్చుకోవాలని రెండు ఆప్షన్లు ఇచ్చారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో రాశారు. మిత్రదేశాలపై ట్రంప్ తన అసనాన్ని వ్యక్తం చేస్తూ ఇకపై ఆ దేశాలు తమ కోసం తాము ఎలా పోరాడాలో నేర్చుకోవాలని, మిత్రదేశాలకు అమెరికాకు అండగా నిలవట్లేదని, అమెరికా కూడా ఇకపై వారికి సహాయం చేయడానికి అందుబాటులో ఉండదని స్పష్టం చేశారు.

## హెచ్1బి వీసా లాటరీ పూర్తి చేశాం

### లాటరీ అభ్యర్థులే ఇకపై పిటిషన్ల దాఖలుకు అర్హులు

### వీరికి 90 రోజుల గడువు ఇస్తున్నట్లు యుఎస్‌సిఐఎస్ వెల్లడి

వాషింగ్టన్, ఏప్రిల్ 1: అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణులకు కీలకమైన హెచ్1బీ వీసాకు సంబంధించి యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ముఖ్య నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వీసాల కోటాకు సరిపడా ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్లు అందాయని, లాటరీ ప్రక్రియను పూర్తి చేశామని ఎంపికైన లబ్ధిదారుల వివరాలను వారి పిటిషనర్లకు తెలియజేశామని పేర్కొంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ ఖాతాల ద్వారా తమ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన వారు మాత్రమే ఏప్రిల్ 1, 2026 నుంచి హెచ్1బీ పిటిషన్లు దాఖలు చేయడానికి అర్హులు. పిటిషన్ల దాఖలుకు కనీసం 90 రోజుల గడువు ఉంటుందని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. పిటిషన్‌తో పాటు లాటరీలో ఎంపికైనట్లు తెలిపే సెలక్షన్ నోటీసు కాపీని జతచేయాలి. ఈ ఏడాది నుంచి యూఎస్‌సీఐఎస్ కొన్ని కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా, అధిక నైపుణ్యాలు, అధిక వేతనాలు ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా వెయిటెడ్ సెలక్షన్ సిస్టమ్ ప్రవేశపెట్టింది. పిటిషన్ దాఖలు సమయంలో రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న పాస్‌పోర్ట్, ఉద్యోగ వివరాలు సరిపోవాలని స్పష్టం చేసింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త వెర్షన్ ఫారం ఐ129 (02/27/26 నాటిది) మాత్రమే స్వీకరిస్తామని తెలిపింది. 2025 సెప్టెంబర్ 21 తర్వాత దాఖలు చేసే కొన్ని ప్రత్యేక హెచ్1బీ పిటిషన్లకు అర్హత షరతుగా అదనంగా 1,00,000 డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని ఏజెన్సీ పేర్కొంది. ప్రతి ఏటా కాంగ్రెస్ 65,000 హెచ్1బీ వీసాలను కేటాయిస్తుండగా, అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి అదనంగా 20,000 వీసాలు అందుబాటులో ఉంటాయి. టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాల్లోని సంస్థలు ఈ వీసా ప్రోగ్రామ్‌పై ఎక్కువగా ఆధారపడతాయి. ఏటా హెచ్1బీ వీసాలు పొందుతున్న వారిలో భారతీయుల వాటా గణనీయంగా ఉంటోంది.

## దేశవ్యాప్తంగా జనగణన షెడ్యూలు ప్రారంభం

### తొలిసారిగా డిజిటల్ విధానంలో కుటుంబాల వివరాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశంలో జనాభా లెక్కల కోసం కేంద్రం చేపట్టిన జనగణన తొలివిడత కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. ఇది 16వ విడత లెక్కింపు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో సారి జరుగుతున్నట్లయింది. తొలిసారి జనగణన దేశంలో 1872లో ప్రారంభమైంది. అంతకుముందు చివరిసారిగా 2011లో జనాభాను లెక్కించారు. నిజానికి షెడ్యూల్ ప్రకారం 2021లో తిరిగి జనాభా లెక్కింపు ప్రారంభం కావాలి. ఆ సమయంలో కోవిడ్ కారణంగా ఇది వాయిదాపడింది. అందువల్ల ఇప్పుడు జనగణన కేంద్రం మొదలుపెట్టింది. ఈసారి భారీ మొత్తంలో, సాంకేతికతను ఉపయోగించి డిజిటల్ విధానంలో కూడా జనగణన చేపట్టనుంది. మొదటి దశలో ఇళ్లను లెక్కిస్తారు. ఆ తర్వాత రెండో దశలో జనాభాను లెక్కిస్తారు. ఈ సారి కులగణన కూడా చేపడతారు. వచ్చే ఆరు నెలలపాటు అంటే సెప్టెంబర్ వరకు ఇండ్లు, వాటి స్థితి, గృహోపకరణాలు వంటివి లెక్కిస్తారు. మొదటివిడత జనగణనకు రిఫరెన్స్ డేట్ మార్చి 1, 2027. జమ్మూ కాశ్మీర్, లడాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచు కురిసే, వాతావరణం అనుకూలించని ప్రాంతాలకు మాత్రం రిఫరెన్స్ డేట్ అక్టోబర్ 1, 2026. అలాగే, వేర్వేరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తొలి విడత జనగణన వేర్వేరుషెడ్యూల్స్‌లో ఉంది. రెండోదశలో జనాభా లెక్కింపు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతుంది. ఎప్పటిలాగే శీతల ప్రాంతాలైన జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో మాత్రం ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే జనగణన ప్రారంభమవుతుంది. మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరిస్తారు. 16 భారతీయ భాషల్లో వివరాలు నమోదు చేయవచ్చు. ఈ జనగణన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.11,718 కోట్లు కేటాయించింది. తెలంగాణలో తొలివిడత జనగణన మే 11 నుంచి ప్రారంభమవుతుంది. జూన్ 9 వరకు కొనసాగుతుంది. తొలి విడతలో ఎన్యుమరేటర్లు ప్రజలను 33 ప్రశ్నలు అడుగుతారు. అంటే 33 అంశాలకు సంబంధించి వివరాలు సేకరిస్తారు. జనగణనలో సేకరించే వివరాల్ని రహస్యంగా ఉంచుతారు. జనాభా లెక్కల ఆధారంగా ప్రభుత్వ పథకాల వర్తింపు ఉండదు. ప్రజల నుంచి ఎలాంటి డాక్యుమెంట్లను సేకరించరు. ఈ కార్యక్రమం పూర్తైన తర్వాత పూర్తి వివరాల్ని ప్రభుత్వం వచ్చే ఏడాదే వెల్లడిస్తుంది.

## నల్లసముద్రంలో కుప్పకూలిన రష్యా సైనిక విమానం

### 29 మంది దుర్మరణం



మాస్కో,ఏప్రిల్ 1: రష్యాలో ఘోర విషాదం చోటు చేసుకుంది. క్రిమియాలో రష్యా సైనిక విమానం కూలిపోయింది. బుధవారం తెల్లవారుజామున కొండను ఢీకొట్టడంతో ఏఎన్26 సైనిక విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 23 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దుర్మరణం చెందారు. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపినట్లు రష్యా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. రష్యాకు చెందిన ఏఎన్26 సైనిక విమానం మియా ద్వీపకల్పం మీదుగా ప్రయాణిస్తోంది. అయితే ఈ విమానం 2014లో ఉక్రెయిన్ నుంచి స్వాధీనం చేసుకున్న నల్ల సముద్ర ద్వీపకల్పంలో కూలిపోయింది. కొండను ఢీకొట్టి కూలిపోయినట్లుగా తెలుస్తోంది. విమానంలో ఉన్న 23 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది అక్కడికక్కడే చనిపోయారు. ఈ ప్రమాదానికి సాంకేతికలోపమే కారణంగా తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలను మాత్రం రష్యా ఇంకా వెల్లడించలేదు. మాస్కో కాలమానం ప్రకారం గతనెల 31న సుమారుగా సాయంత్రం నాలుగు గంటలకు విమానం క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తున్నట్లు సమాచారం. కొద్దిసేపటికే విమానంతో సంబంధాలు తెగిపోయినట్లుగా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వెంటనే సహాయక బృందం ఏఎన్26 విమానం కూలిపోయిన ప్రదేశాన్ని గుర్తించింది. ఘటనా స్థలంలోనే ఆరు గురు సిబ్బంది, 23మంది ప్రయాణికులు చనిపోయినట్లుగా మంత్రిత్వశాఖతెలిపింది.విమానంపై ఏదైనా దాడి జరిగినట్లుగా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో సాంకేతికలోపమే ఈ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

## హోంల్యాండ్ సెక్యూరిటీ మాజీ చీఫ్ వింత వేషధారణలు

వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 1: అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఒక సంచలన కుంభకోణం వెలుగు చూసింది. హోంల్యాండ్ సెక్యూరిటీ మాజీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ భర్త బ్రయాన్ నోయెమ్ మహిళా వేషధారణలో (క్రాస్ డ్రెస్సింగ్) ఉన్న ఫోటోలు బయటకు రావడం కలకలం రేపింది. ఆన్‌లైన్‌లో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్సూరెన్స్ రంగంలో ప్రముఖుడైన 56 ఏళ్ల బ్రయాన్ నోయెమ్ తన భార్య పదవిలో ఉండగా ఆన్‌లైన్‌లో పలువురు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వచ్చాయి. హాట్ పింక్ రంగు అండర్ వేర్, నకిలీ వక్షోజాలతో ఉన్న ఆయన ఫొటోలను ఈ నివేదిక బయటపెట్టింది. ముగ్గురు పిల్లల తండ్రి అయిన బ్రయాన్, అపరిచితులతో అభ్యంతరకరమైన ఫొటోలను పంచుకున్నారని కథనం పేర్కొంది. గత మార్చిలో డొనాల్డ్ ట్రంప్ క్రిస్టీ నోయెమ్‌ను పదవి నుంచి తొలగించారు. తన భర్త చర్యల వల్ల తాను బ్లాక్‌మెయిల్‌కు గురయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆమె ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో కుటుంబం షాక్‌కు గురైంది. ఈ సమయంలో మాకు ప్రైవసీ కావాలి. మా కోసం ప్రార్థించాలని కోరుకుంటున్నామని నోయెమ్ కుటుంబ ప్రతినిధి తెలిపారు. ఈ వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. బ్రయాన్ ప్రవర్తనను కుటుంబం ధ్రువీకరించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## గుజరాత్‌పోర్టుకు వస్తున్న ఇరాన్ తొలి చమురునౌక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4న ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని ఏప్రిల్ 4న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ ముడి చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో దాదాపు 6లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎలాంటి సమాచారం లేదు. గతంలో భారత్.. ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్‌వాటా సుమారు 11.5 శాతం ఉంది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా మే 2019 నాటికి అది రోజుకు 2,68 లక్షల బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆదేశం నుంచి ముడి చమురు దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

## 8 గంటల్లోపు రద్దుచేస్తే నో రిఫండ్: ఐఆర్‌సిటిసి కొత్త రూల్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: భారతీయ రైల్వే ప్రయాణికులకు రైలు టికెట్ల రద్దు, రిఫండ్ విధానంలో మార్పులు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం, రైలు బయలుదేరడానికి 8 గంటలలోపు కన్ఫర్మ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే ప్రయాణికులకు ఎలాంటి రిఫండ్ లభించదు. గతంలో ఈ గడువు 4 గంటలుగా ఉండేది. ప్రయాణానికి 8 గంటల నుంచి 24 గంటల మధ్యలో టికెట్‌ను రద్దు చేస్తే టికెట్ ధరలో 50 శాతం మాత్రమే తిరిగి వస్తుంది. అదేవిధంగా, 24 గంటల నుంచి 72 గంటల ముందు రద్దు చేసుకుంటే 25 శాతం కోత విధించి, 75 శాతం మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ఒకవేళ ప్రయాణానికి 72 గంటల కంటే ముందే టికెట్‌ను రద్దు చేస్తే కేవలం సాధారణ రద్దు ఛార్జీలు మాత్రమే వర్తిస్తాయి. టికెట్ ఏజెంట్లు, దళారులు పెద్ద సంఖ్యలో టికెట్లను బ్లాక్ చేసి, చివరి నిమిషంలో రద్దుచేయడాన్ని అరికట్టేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు రైల్వే శాఖ తెలిపింది. దీనివల్ల నిజమైన ప్రయాణికులకు చివరి నిమిషంలో కూడా బెర్తులు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు కానున్నాయి.

## వాహనాలకు నిప్పంటించిన మహిళ



భువనేశ్వర్, ఏప్రిల్ 1: హైకోర్టు ముందు పార్క్ చేసిన వాహనాలకు ఒక మహిళ నిప్పంటించింది. మండుతున్న వస్తువును కోర్టు ప్రాంగణంలోకి విసిరింది. ఈ సంఘటనలో పలు వాహనాలు దగ్ధం అయ్యాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఒడిశాలోని కటక్‌లో ఈ సంఘటన జరిగింది. కటక్‌లోని ఒడిశా హైకోర్టు వద్దకు ఒక మహిళ చేరుకున్నది. కోర్టు బయట పార్క్ చేసిన స్కూటర్ వెనుక పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. మండుతున్న వస్తువును కోర్టు ప్రాంగణంలోకి విసిరింది. వాహనాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. బొలెరో వాహనం, ఎలక్ట్రిక్ స్కూటర్, రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయి. మంటలు పెద్ద ఎత్తున మండుతుండడంతో అక్కడున్న జనం భయాందోళనకు గురైనారు. ఫైర్ సిబ్బంది వచ్చి వెంటనే మంటలు ఆర్పివేశారు. నిప్పు పెట్టిన మహిళ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టిని ఆకర్షించేందుకు ఉద్దేశపూర్వకంగా వాహనాలకు నిప్పు పెట్టినట్లు తెలిపింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా బిరిడి ప్రాంతానికి చెందిన మినాటి సాహుగా నిందితురాలిని గుర్తించారు. ప్రధాని మోడీని కలవాలనుకున్నాను, అది కుదరకపోవడంతో ఈ చర్యకు పాల్పడినట్లు నిందితురాలు చెప్పిందని పోలీస్ అధికారి తెలిపారు. ఆ మహిళ మానసికంగా కలత చెందినట్లుగా తెలుస్తుదని అన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఒకే సీటు కోసం ఇద్దరు నేతల పోటీ!

చెన్నై, ఏప్రిల్ 1: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐ ఎడిఎంకె, బిజెపి కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. 27 స్థానాల్లో బిజెపి పోటీ చేయనుంది. అయితే ఓ సీటు కోసం మాత్రం బిజెపిలో కుమ్ములాట సాగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ జోక్యం చేసుకున్నా ఇద్దరు నేతలు మాత్రం ఆ సీటు కోసమే పట్టుబడినట్లు సమాచారం. రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై, మహిళా మోర్చా చీఫ్ వనతి శ్రీనివాసన్ ఒకే సీటుకోసం పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కోయంబత్తూర్ నార్త్ నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలలో ఉన్నారు. 27 సీట్లను పంచుకునే క్రమంలో జరిగిన మీటింగ్‌లో ఇద్దరు నేతలు కోయంబత్తూర్ సీటు కోసం పట్టుపట్టినట్లు తెలుస్తోంది. సీటు షేరింగ్ వల్ల సింగనల్లూర్, కవుందంపాల్కం సీట్లను ఎఐఎడిఎంకెకు కేటాయించారు. అయితే కోయంబత్తూర్ నార్త్ సీటును వనతి శ్రీనివాసన్‌కు కేటాయించారు. కానీ అన్నామలై కూడా కోయబంత్తూర్ బర్త్‌ను కోరుకుంటున్నారు. దీంతో ఆ ఇద్దరి మధ్య ఇంటర్నల్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వనతి శ్రీనివాసన్ చాన్నాళ్ల నుంచి ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్నారని, ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించలేమని పార్టీ స్పష్టం చేసింది. కానీ ఇదే ప్రాంతం నుంచి పోటీ చేయాలని అన్నామలై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరునేతల్లో ఒకరిని రామనాథపురం నుంచి పోటీచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



# సామాజిక సంస్కరణలకు 'నిలువెత్తు రూపాలు'

### అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధులు

### మహిళా విద్యా విస్తరణకు జీవితాంతం కృషి చేసిన దంపతులు

### 11న ఫూలే జయంతి సందర్భంగా భారీ విగ్రహావిష్కరణ

**జూబ్లీహిల్స్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** వారు సామాజిక సంస్కరణలకు పునాది వేశారు.. మహిళా విద్యకు శ్రీకారం చుట్టి తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి సమాజంలో మార్పుకు శ్రీకారం చుట్టారు.. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతూ సమానత్వాన్ని ప్రోత్సహించారు.. సామాజిక సమానత్వం, విద్యా విస్తరణకు జీవితాంతం కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫులె దంపతుల స్ఫూర్తిని భావి తరతరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. వారి సేవలను స్మరించుకునే విధంగా హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిలువెత్తు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయడానికి అధికారులు వేగంగా చర్యలు చేపడుతున్నారు. సుందరీకరణ పనులతో పాటు విగ్రహాల ఏర్పాటును పూర్తి చేసి ఈ నెల 11న ఫూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాలను ఆవిష్కరించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

**చకచకా ఏర్పాట్లు**

16 అడుగుల ఎత్తైన విగ్రహాల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేయగా, సంబంధిత శాఖలు సమన్వయంతో పనులు వేగవంతం చేస్తున్నాయి. విగ్రహాల రూపకల్పనలో ఫూలే దంపతుల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా



ఫూలే దంపతుల కాంస్య విగ్రహాల నమూనా చిత్రం

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్క్ వద్ద ఫూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు. విగ్రహాల ఏర్పాటుతోపాటు విగ్రహాల చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. పచ్చదనం, ఆధునిక లైటింగ్ సదుపాయాలు, కూర్చునే ఏర్పాట్లు, పర్యాటకులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పీడస్టల్, ప్రహారిగోడ, రైలింగ్ పనులను పూర్తి చేశారు. మిగిలిన తుది దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ విగ్రహాలు కేవలం స్మారక చిహ్నాలుగానే కాకుండా, ప్రజలకు స్ఫూర్తినిచ్చే కేంద్రాలుగా మార్చాలని లక్ష్యంగా పనులను చేపడుతున్నారు.

**స్ఫూర్తి నింపేలా..**

ఫూలే దంపతులు భారతదేశంలో విద్యా విస్తరణకు, ముఖ్యంగా మహిళా విద్యకు చేసిన సేవలు అమోఘం. వారి ఆశయాలను ప్రతిబింబించేలా విగ్రహాల ఏర్పాటు ద్వారా సమాజంలో సమానత్వం, విద్య ప్రాధాన్యంపై అవగాహన పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్య, సామాజిక న్యాయం వంటి విలువలను యువతలో నాటేందుకు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తుంది. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న ఈ నిర్మాణాలు భావితరాల్లో ఆలోచనలు, విలువలు తరతరాలకు చేరేలా లక్ష్యంగా పెట్టుకొని పనులను కొనసాగిస్తున్నారు.

**ప్రత్యేక నిధులతో..**

ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 4 కోట్ల మేర ప్రత్యేకంగా నిధులను కేటాయించగా, పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతోంది. సంబంధిత ఇంజినీరింగ్, మున్సిపల్ శాఖల అధికారులు తరచూ స్థలాలను పరిశీలిస్తూ పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. దీనికితోడు తాజాగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులతో సమీక్షించి పనుల వేగిరాన్ని పరిశీలించారు. మరోవైపు ఫూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు పట్ల పలు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సామాజిక సంస్కరణలకు ప్రతీకలైన ఈ మహానుభావులకు నగర హృదయంలో స్థానం కల్పించడం పట్ల ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఫూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు ద్వారా హైదరాబాద్ నగరం సామాజిక చైతన్యానికి కొత్త దిశగా అడుగులు వేస్తోంది. ఇది కేవలం ఒక నిర్మాణమే కాకుండా, సమాజంలో విలువల పరిరక్షణకు, అవగాహన పెంపుకు కీలక చర్యగా నిలవనుంది.

# జర్మనీ, జపాన్‌లో నర్సులకు భారీ డిమాండ్

### మాసబ్ ట్యాంక్‌లో టిజిఐఐసి భవనాన్ని పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సులకు భారీ డిమాండ్ ఉందని, నెలకు రూ.2 లక్షల వరకు జీతాలు లభిస్తున్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ మాసబ్ ట్యాంక్‌లోని టిజిఐఐసి భవనాన్ని టామ్ కామ్ కార్యాలయం కోసం లీజుకు తీసుకొనగా బుధవారం మంత్రి వివేక్, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ కలిసి పరిశీలించారు. జర్మనీలోని ఉద్యోగావకాశాలను అధ్యయనం చేయడానికి త్వరలోనే ఓ ప్రతినిధి బృందం పర్యటించనున్నట్టు తెలిపారు. ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగానికి అవసరమైన 1000 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, అక్కడ యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయిందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో టామ్ కామ్ కోసం ప్రత్యేకంగా రూ.90 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో చదివే విద్యార్థుల కోసం సిఎం ప్రవేశపెట్టిన రూ.2000 స్కాలర్‌షిప్ పథకం ఎంతో ఉపయోగకరమని మంత్రి పేర్కొన్నారు.

# ఖరీఫ్ యూరియా కోటా 11.50లక్షల మె.ట.కు పెంచండి

### జూలై, ఆగస్టులో నెలకు మూడులక్షల మె.ట బఫ్‌స్టాక్ నిల్వలు కావాలి

### రసాయనాలు,ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు ఎంపి మల్లురవి లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** తెలంగాణకు ప్రస్తుతం ఖరీఫ్‌సీజన్‌కు కేటాయించే పదిలక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటాను 11.50లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర రసాయనాలు,ఎరువులశాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను తెలంగాణ ఎంపి మల్లురవి కోరారు. జెపినడ్డాకు లేఖ రాస్తూ గత సంవత్సరం సకాలంలో సరఫరా చేయలేదని వివరించారు. ఆర్‌సిఎఫ్ క్రిబ్‌కో,ఆఎప్‌సిఎల్ నుంచి ఈ రబీ సీజన్‌లో సరఫరాచేయాల్సిన యూరియా 0.65లక్షలమె.ట తక్కువ సరఫరాచేశారని ఆయన తెలిపారు. 1.34లక్షల టన్నులు మాత్రమే మార్చి నెలలో వచ్చిందని తెలిపారు. జూలై ఆగస్టు నెలలలో వరి,పత్తి ఇతర వాణిజ్య పంటలు విత్తనాలు చల్లడం పూర్తై యూరియా మొదటి డోస్ వేయాల్సి ఉంటుందని ఆనెలలో అత్యంత ఎక్కువ యూరియా రైతులు పంటక్షేత్రాలలో చల్లుతారని కనీసం ఆరెండు నెలలు మూడలక్షల మె.ట బఫర్‌స్టాక్ యూరియాను సరఫరాచేసి నిల్వచేయాలని కోరారు.ఏప్రిల్ మేనెలలో రెండులక్షలమె.ట. చొప్పన యూరియా తెలంగాణకు సరఫరాచేయాలని అభ్యర్థించారు.

### ఆటో డ్రైవర్ల ఎల్పీజీ కష్టాలు బిఆర్ఎస్, బిజెపి నాయకుల

# కళలకు కనిపించటం లేదా!

### టిపిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామోహాన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల ఎల్పీజీ కష్టాలు బిఆర్ఎస్ బిజెపి నాయకుల కళ్ళకి కనిపించటం లేదా ఎందుకు వారి సమస్యలను పరిష్కరించడానికి బిఆర్ఎస్ ముందుకు రావడంలేదని బిజెపి,బిఆర్ఎస్ ఫెవికాల్ బంధం దీనితో మరోసారి బయటపడిందని టిపిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామోహన్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో బుధవారం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎల్పిజి బంక్‌ల ముందు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారనీ ఐనా కేంద్రం స్పందించడంలేదని ఆవేదన చెందారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఆటో వాళ్లకి నష్టాలు అంటూ ఆటోలు ఎక్కి సెల్ఫీ వీడియోలు తీసుకున్న బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ఎల్పిజి లేకపోతే ఆటోలు నడవవు అన్న సంగతి బిఆర్ఎస్ బిజెపి నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో 95,000 ఎల్పిజి ఆటోలు ఉన్నాయనీ ఆయన వివరించారు.

# ఆటో ఎల్‌పిజి కొరత రానివ్వొద్దు

### కంపెనీలను ఆదేశించిన పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర

హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:ఆటో ఎల్‌పిజి గ్యాస్ కొరతను తీర్చి, ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడేదిశగా చర్యలు తీసుకోవాలని గ్యాస్ కంపెనీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవింద్ర ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పౌర సరఫరాల భవన్‌లో ప్రైవేట్ ఆటో ఎల్‌పిజి మార్కెటింగ్ కంపెనీలైన ఎజిస్ గ్యాస్, సూపర్ గ్యాస్, గొ గ్యాస్, టోటల్ ఎనర్జిస్, ప్రైమ్ గ్యాస్, ఎక్స్‌ట్రా గ్యాస్, యుని గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్యాస్ కొరతకు ముందు, ఆ తర్వాత ఉన్న సప్లై పరిస్థితులపై ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 110 బంకులతో ఆటో ఎల్‌పిజి మార్కెట్‌లో ఈ ప్రైవేట్ కంపెనీలకే 80 శాతం వాటా ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో అన్ని మార్గాల ద్వారా వెంటనే ఎల్‌పిజిని దిగుమతి చేసుకుని అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆయా కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్యాస్ సరఫరాను పెంచాల్సిన అవసరం చాలా ఉందని నిర్దేశించారు. గ్యాస్ సప్లైని తగినంతగా ఉంచడంలో ఎవరైనా విఫలమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గద్దర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు తగవు

### టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రజా యుద్ధనౌక, దివంగత గద్దర్ పట్ల పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ బతుకు చిత్రాన్ని గజ్జె కట్టి, గళం విప్పి, పాట రూపం లో ప్రపంచానికి చాటి చెప్పి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన యోధుడు "గద్దర్" అని ఆయన కొనియాడారు. కర్షక, కార్మిక లోకానికి అండగా కాషాయ కసాయి పార్టీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన గద్దర్ రాహుల్ గాంధీ కలవడాన్ని ప్రజలంతా స్వాగతించారనీ ఆయన వివరించారు. తెలంగాణ సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన "గద్దర్' పేరిట, "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డు"లను ప్రారంభించడం తోపాటు, గద్దర్ కూతురు వెన్నెలను "తెలంగాణ సాంస్కృతిక సారథి'కి ఛైర్‌పర్సన్‌గా సిఎం నియమించారని అన్నారు.

# ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఎప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం మూడోవిడత పైలట్ ప్రాజెక్ట్ విస్తరణ బ్రోచర్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఆవిష్కరించారు. ఈ పథకం భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అమలులో ఉందన్నారు. ఈ పథకం విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని అందించడంలో, ప్రాయోగిక విద్యను బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, యువతలో ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలను పెంపొందించవచ్చని తెలిపారు. విద్యార్థులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యా మండలి తరఫున ఇంటర్న్‌షిప్‌లు, అనుభవాధారిత అభ్యాసం, పరిశ్రమ అనుసంధానానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ పథకం అమలుపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించి, పురోగతిని పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

### పాఠశాల విద్యార్థులకు

# 21 వస్తువులతో స్కూల్ కిట్

హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యార్థులకు స్పెషల్ కిట్ పంపిణీ చేయనున్నారు. 21 వస్తువులతో స్కూల్ కిట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే కలర్ యూనిఫామ్ అమలు చేయాలని కూడా సర్కార్ నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ వ్యవస్థల్లో మొత్తం 26లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 19లక్షల మంది ఉన్నారు.

# పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రం ముందంజ

### టాప్ 10లో తెలంగాణకు చోటు

### 7,879 మెగావాట్లకు చేరుకున్న సామర్థ్యం

### ఎనర్జీ స్టాటిస్టిక్స్ ఇండియా-2026 నివేదిక వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధనంలో తెలంగాణ దూసుకుపోతోంది. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం 7,879.74 మెగావాట్లకు చేరుకుని, దేశంలోని అగ్ర స్థానంలోని 10 రాష్ట్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో సౌరశక్తి వాటా 5,033.50 మెగావాట్లు, భారీ జల విద్యుత్ 2,405.6 మెగావాట్లు, పవనశక్తి 128.1 మెగావాట్లు, జీవశక్తి 221.67 మెగావాట్లు, చిన్న జలవిద్యుత్ 90.87 మెగావాట్లుగా ఉంది. ఈ మేరకు జాతీయ గణాంకాల కార్యాలయం తాజాగా విడుదల చేసిన ఎనర్జీ స్టాటిస్టిక్స్ ఇండియా 2026 నివేదిక ప్రకారం, గత ఏడాది మార్చి 31 నాటికి దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 47,04,043 మెగావాట్లకు చేరుకుంది. ఇందులో సౌరశక్తి 71 శాతం వాటాతో 33,43,378 మెగావాట్లు, పవనశక్తి 11,63,856 మెగావాట్లు, భారీ జలవిద్యుత్ 1,33,410 మెగావాట్లు చొప్పున యూనిట్లు ఉన్నాయి. ఇక రాష్ట్ర విద్యుత్ సంస్థలు నిర్వహించే బలమైన పారిశ్రామిక డిమాండ్ మధ్య, తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2014-15లో 1,356 కిలోవాట్ పర్ అవర్ (కెడబ్ల్యూహెచ్) నుండి 2021-22లో 2,126 కెడబ్ల్యూహెచ్‌కు పెరిగి జాతీయంగా 10వ స్థానంలో నిలిచింది. అయితే, మార్చి 2025 నాటికి భారతదేశ అంచనా పునరుత్పాదక ఇంధన సామర్థంలో తెలంగాణ కేవలం నాలుగు శాతం వాటాను మాత్రమే కలిగి ఉంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తొమ్మిది శాతంతో దీనికంటే ముందుంది. కాగా రాజస్థాన్ 24 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (14 శాతం), గుజరాత్, ఆంధ్రప్రదేశ్ (తొమ్మిది శాతం చొప్పున), కర్ణాటక (8.6 శాతం), మధ్యప్రదేశ్ (8.09 శాతం) ఉన్నాయి. దేశ హరిత ఇంధన పరివర్తనలో తమ కీలక పాత్రను సుస్థిరం చేసుకున్నాయి. ఇక బొగ్గు నిల్వల విషయంలో తెలంగాణ కేవలం 5.81 శాతంతో ఒడిశా (25.20 శాతం), జార్ఖండ్ (23.27 శాతం), ఛత్తీస్‌గఢ్ (21.28 శాతం) కంటే చాలా వెనుకబడి ఉంది. అలాగే రాష్ట్రంలో లిగ్నైట్ నిల్వలకు సంబంధించి తమిళనాడు 79.21 శాతంతో ఆధిపత్యం చెలాయించింది. అలాగే ముడి చమురు, సహజ వాయువు నిల్వలు కూడా రాష్ట్రంలో లేవు. మొత్తం మీద తెలంగాణ 1,98,368 మెగావాట్ల సామర్థ్యంతో దేశ సంయుక్త ఇంధన నిల్వలు, సామర్థ్యంలో 4.22 శాతాన్ని కలిగి ఉంది. రాజస్థాన్ 23.70 శాతంతో (11,14,794 మెగావాట్లు) అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (14.26 శాతం, 6,71,024 మెగావాట్లు), ఆంధ్రప్రదేశ్, గుజరాత్ (రెండూ సుమారు 9.10 శాతం, వరుసగా 4,27,933 మరియు 4,27,954 మెగావాట్లు) ఉన్నాయి. ఈ వనరుల కొరత, రాష్ట్రానికి అందుబాటులో ఉన్న సహజ వనరుల కంటే, సామర్థ్య విస్తరణపైనే తెలంగాణ ఎక్కువగా ఆధారపడి ఉందని ఎనర్జీ స్టాటిస్టిక్స్ నివేదిక స్పష్టం చేసింది.

# తెలంగాణకు ఇచ్చినహామిలు అమలు చేయండి

### ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత తేవడం హార్షణీయం

### తెలంగాణ రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లులలో రాష్ట్ర విభజన సందర్భంగా తెంగాణకు ఇచ్చనహామిలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రవాణాబిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఆంధ్ర ప్రజలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. అయితే, ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పున విభజన చట్టం 2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని..వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి ముఖ్య ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని. ఇవి తెలంగాణ అభివృద్ధికి కీలకమని ఆయన గుర్తుచేశారు. ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైంది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా...

**పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో పొన్నం బిజీబిజీ**

పుదుచ్చేరిలో ప్రస్తుత ఎన్‌డిఎ కూటమి పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజాభిప్రాయం ను కాంగ్రెస్‌కు అనకూలంగా మార్చుకోవడానికి స్థానిక సమస్యల పరిష్కార మార్గాలను వివరించాలని పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. పుదుచ్చేరిలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులతో ఆయన సమావేశమైనారు. అనంతరం రవాణా, బిసి సం



క్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌వివిధ నియోజకవర్గాలలో ప్రచారం నిర్వహించారు పొన్నం మూడు రోజుల పాటు పుదుచ్చేరిలోనే బసచేసి ప్రచారం ఎన్నికలలో కార్యకర్తల నిర్వహణవంటి అంశాలను పరిశీస్తారు. పొన్నంను ఎన్నికల సందర్భంగా పుదుచ్చేరికి కాంగ్రెస్ పార్టీఎన్నికల పరిశీలకులుగా, స్టార్ క్యాంపెయినర్‌గా ఎఐసిసి నియమిం చింది. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా వివిధ నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు రోడ్‌షోలు, బహిరంగసభలు, ర్యాలీలు, ఇంటింటి సందర్శన వంటి పద్దతుల్లో ప్రచారం చేయాలని కార్యాచరణ రూపొందించుకొన్నారు.

### కేటాయింపు మేర యూరియా

# సరఫరా చేయండి

### కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి



**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** ఫార్మర్ రిజిస్ట్రిలో 112 శాతం అచీవ్‌మెంట్ తో రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో ఉందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుండి బుధవారం మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రిలో ముందున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే మూడు నెలలలో పాస్ బుక్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తిచేస్తామని కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో యూరియా లభ్యత, యూరియా యాప్ అమలు విధానం గురించి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ఖరీఫ్‌లో కేటాయింపులకు అనుగుణంగా రాష్ట్రానికి సమయానికి యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

### జాతీయ జెండా రూపకర్త

# పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

### మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు

**హైదరాబాద్, ఏప్రిల్1ప్రభాతవార్త:** జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు కేంద్రం ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని మాజి ఎంపి వి హనుమంతరావు డిమాండ్ చేశారు. జాతీయ జెండా రూప కల్పన చేసిన రోజు సందర్భంగా బుధవారం అంబర్‌పేట్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండా ఎగరవేసి పింగళి వెంకయ్యకు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ పింగళి వెంకయ్యకు జాతీయ జెండా రూపకల్పన చేయాలని సూచించడంతో పింగళి వెంకయ్య జాతీయ జెండాను తయారు చేశారని అలాంటి పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన సూచించారు.

# సమన్వయంతో విత్తనాభివృద్ధి సంస్థ విభజన

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విభజన అంశాన్ని పరస్పర సహకారంతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుబ్బారెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ఎండి యాస్మీన్ బాషా నిర్ణయించారు. ఈ మేరకు సంస్థ విభజన అంశంపై బుధవారం హైదరాబాద్‌లోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. వివిధ కారణాల వలన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన పరిపాలన భవన పంపకాల సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా చర్చలు కొనసాగాయి. అయితే విభజన ప్రక్రియ పురోగతిలో ఉన్న నేపథ్యంలో రైతులకు సంబంధించిన వాటాల పంపకం జరగకపోవడం ప్రధాన సమస్యగా మారిందని ఇరు రాష్ట్రాల అధికారులు ఓ అభిప్రాయానికి వచ్చారు.

### ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు కోసం

# విదేశీ సహకార బిల్లుకు సవరణలు

### వ్యాపారసౌలభ్యం పేరుతో అవినీతికి కార్పొరేట్ సంస్థలకు అనుమతి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** మైనారిటీ సంస్థలకు విదేశాల నుంచి లభించే ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నియంత్రించే ప్రయత్నంలో భాగంగా విదేశి సహకార నియంత్రణ చట్టం సవరణ బిల్లు చేస్తున్నారని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం విదేశి సహకార నియంత్రణ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ధర్నాలో ఆయన ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలులో భాగంగానే ప్రభుత్వం ఈ సవరణ ప్రతిపాదిస్తోందని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగంలో అన్ని కులాలకు మతాలకు సమాన హక్కులు ప్రసాదించిందని ఆయన వివరించారు. మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చట్టసవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేతిలో అంకుశంగా మారిన బిల్లును అడ్డుకొంటామని అన్నారు. ఇది ఇలా ఉంటే లోక్‌సభలో వ్యాపార సౌలభ్యం పేరుతో అవినీతి, మోసం, కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇచ్చేందుకు అమెండ్‌మెంట్ ఆఫ్ ప్రివిజన్స్ బిల్-2026 తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. రైల్వేల చట్టం సెక్షన్ 145 ఆల్కాహాల్ ప్రభావంతో అసభ్య ప్రవర్తనకు 24 గంటలు జైలు సెక్షన్ 147 అతిక్రమణలకు మూడునెలలు సెక్షన్ 162 మహిళల రిజర్వేషన్ డబ్బాలకు రక్షణ నిబంధలను బలహీనపరచడం తగదని మహిళల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని హెచ్చరించారు. మహిళలకు భద్రత పెంచడానికి శిక్షలు బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ లోక్‌సభలో కిషన్‌రెడ్డి నిందులు వేయడం తగదు బిఆర్ఎస్ స్క్రిప్టును లోక్‌సభలో చదివి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మంత్రి కిషన్‌రెడ్డి ప్రయత్నం చేశారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాను ఉన్నాను అని చెప్పుకునే ప్రయత్నం చేశారనీ ఆయన దుయ్యబట్టారు. తెలంగాణలో ఇప్పుడు ఆర్.ఆర్ ట్యాక్స్ నడుస్తోందని లోక్ సభలో రేవంత్‌రెడ్డి నిందలు వేయడం తగదని హితవు చెప్పారు.

# తెలంగాణ నీటిహక్కులు హరించే బనకచర్ల

### రాష్ట్రానికి రావాల్సిన 200టిఎంసిల పెన్నాబేసిన్‌కు మళ్ళించే యత్నం

### తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్రం

### పార్లమెంట్‌లో గళం విప్పిన గడ్డం వంశీ

**హైదారబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితె తెలంగాణ నీటి హక్కులు హరించి వేస్తుందని కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత ప్రాజెక్టును నిలువరించాలని పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ సభ్యుడు గడ్డం వంశీ డిమాండ్ చేశారు. బుధవారం పార్లమెంట్‌లో తెలంగాణ హక్కులపై గట్టిగా స్వరం పెద్దపల్లి ఎంపి వంశీ తెలంగాణ హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాలను సభకు వివరించి ఇప్పటికైనా ఎపి న్యాయంగా వ్యవహరించాలని హితవు చెప్పారు. 1969 తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ, అప్పటి పోరాట స్ఫూర్తి ఇప్పటికీ తెలంగాణకు జరుగుత్ను అన్యాయాలను ఎదుర్కొనడానికి అవసరమేనని అన్నారు. ఆ సమయంలో కాకా వెంకట స్వామి సహా అనేక మంది నాయకులు తెలంగాణ కోసం చేసిన త్యాగాలను స్మరించారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే కారణంతోనే ఉద్యమం జరిగింది. కానీ ఈ రోజు వరకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదు" అని ఆయన పేర్కొన్నారు.నీటి అంశంలో ముఖ్యంగా కృష్ణా,గోదావరి నదుల నీటి నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత బంకచల్ల ప్రాజెక్టు అమల్లోకి వస్తే, తెలంగాణకు హక్కుగా రావాల్సిన సుమారు 200 టిఎంసిల నీరు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీని ప్రభావంతో ఉత్తర తెలంగాణ, ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతం ఎడారిగా మారే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.కేంద్ర నిధుల కేటాయింపులో అసమానత ఉందని విమర్శిస్తూ, తెలంగాణను నిరక్ష్యం చేస్తున్నారని అన్నారు. రైల్వే ప్రాజెక్టుల కేటాయింపులో కూడా నిధుల పంపిణీ సమానంగా జరగడం లేదని పేర్కొన్నారు.విమానాశ్రయాల విషయంలో కూడా తీవ్ర అసమానత ఉందని ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉండగా, తెలంగాణలో మాత్రం పరిమిత సదుపాయాలే ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు డిమాండ్ చేసినప్పటికీ పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లో వెనుకజల సమస్యలు తీవ్రమవుతున్నాయని, దాదాపు రెండు లక్షల మంది ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పరిశ్రమల విషయంలో పరిశ్రమల మార్గం, అర్ధవాహక తయారీ కేంద్రం వంటి ప్రాజెక్టులు తెలంగాణకు రావాల్సి ఉండగా ఇతర ప్రాంతాలకు మళ్లుతున్నాయని అన్నారు. రైతులు, ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు.తెలంగాణ హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి" అని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్లమెంట్‌లో స్పష్టం చేశారు.

# రాష్ట్ర గవర్నర్‌తో త్రిపుర గవర్నర్ భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివ ప్రతాప్ శుక్లాకు ఇంద్రసేనారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే రోజు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారి పుట్టినరోజు కూడా కావడంతో ఇంద్రసేనారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు పలు పరిపాలనా అంశాలపై చర్చించుకున్నారు.

**లోక్ భవన్‌లో ఘనంగా గవర్నర్ జన్మదిన వేడుకలు**

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జన్మదిన వేడుకలను లోక్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఆధ్వర్యంలో లోక్ భవన్ అధికారులు, సిబ్బంది గవర్నర్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అధికారులు, సిబ్బంది గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ సతీమణి జానకి శుక్లా, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె శశికిరణా చారి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వేద పండితులు గవర్నర్‌కు పుట్టినరోజును పురస్కరించుకొని వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ భవానీ శంకర్ పాల్గొన్నారు.

# యుద్ధప్రభావం ఉన్న శాఖలన్నీ సమష్టి కార్యాచరణ అమలుచేయాలి

## భద్రతపై కేబినెట్‌కమిటీ సమీక్షలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో కొనసాగుతున్న పరిస్థితిని, దాని నివారణ చర్యలను సమీక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం కేబినెట్ భద్రతా కమిటీ సమావేశంలో మొత్తం పరిస్థితిని సమీక్షించారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచం మొత్తం సంక్షోభం ఎదుర్కొంటున్నదని, దీని ప్రభావం యావత్ ప్రపంచంపై ఏదో ఒక రూపంలో పడుతోందని శ్రీ మోడీ అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో, ఈ సంఘర్షణ ప్రభావం నుండి పౌరులను కాపాడటానికి అన్ని విధాలా ప్రయత్నించాలని ఆయన అన్నారు. పౌరులకు కనీస సౌకర్యం కలిగేలా ప్రభుత్వంలోని అన్ని శాఖలు కలిసి పనిచేయాలని ప్రధానమంత్రి ఆదేశించారు. ముఖ్యమైన వస్తువుల బ్లాక్ మార్కెటింగ్, నిల్వలు జరగకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో సరైన సమన్వయం చేసుకోవాలని కూడా ఆయన కోరారు. ప్రభుత్వ సమగ్ర విధానంలో అంకితభావంతో పనిచేసేందుకు మంత్రులు, కార్యదర్శులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి ఆదేశించారు. అన్ని రంగాల బృందాలు కూడా సంబంధిత వర్గాలన్నింటితో సంప్రదింపులు జరిపి పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశం వివరాలతో ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదలచేసింది. భద్రతా కమిటీ సమావేశంలో కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి.వి. సోమనాథన్, ప్రపంచ పరిస్థితిపైనా, సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఇప్పటివరకు తీసుకున్న, ప్రణాళిక చేస్తున్న నివారణ చర్యలపైనా సవివరమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. వ్యవసాయం, ఎరువులు, ఆహార భద్రత, పెట్రోలియం, విద్యుత్, ఎంఎస్‌ఎంఈలు, ఎగుమతిదారులు, షిప్పింగ్, వాణిజ్యం, ఆర్థికం, సరఫరా గొలుసులు వంటి అన్ని ప్రభావిత రంగాలలో ఆశించిన ప్రభావం మరియు దానిని పరిష్కరించడానికి తీసుకున్న చర్యలపై చర్చించారు. అలాగేదేశంలోని మొత్తం స్థూల ఆర్థిక పరిస్థితి మరియు తీసుకోవలసిన తదుపరి చర్యలపై కూడా చర్చించారు. ఆహారం, శక్తి మరియు ఇంధన భద్రతతో సహా సామాన్యుడి కీలక అవసరాల లభ్యతపై కూడా ఈ సమావేశం సమగ్ర అంచనా వేసింది. నిత్యావసరాల నిరంతర లభ్యతను కొనసాగించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక చర్యలపై సమావేశంలో చర్చించారు. రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, పెట్రోకెమికల్స్ మరియు ఇతర పారిశ్రామిక రంగాలకు అవసరమైన దిగుమతుల వనరులను వైవిధ్యపరచడానికి మరియు భారతీయ వస్తువులను ప్రోత్సహించడానికి సమీప భవిష్యత్తులో కొత్త ఎగుమతులను అభివృద్ధి చేయడానికి సమావేశంలో అనేక చర్యలపై చర్చించారు. వివిధ మంత్రిత్వ శాఖలు ప్రతిపాదించిన అనేక చర్యలను అన్ని భాగస్వాములతో సంప్రదించిన తర్వాత రాబోయే రోజుల్లో సిద్ధం చేసి అమలు చేస్తారని ఆ ప్రకటనలో తెలిపారు. కాగా ఈసమావేశంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్; హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హార్‌దీప్ సింగ్‌పూరి, వాణిజ్యమంత్రి పియూష్‌గోయల్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్; ఎరువులు రసాయనాల మంత్రి జెపినడ్డా, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లు కూడా సమావేశానికి హాజరయ్యారు. జాతీయభద్రతా సలహాదారు అజిత్‌దోవల్, సీనియర్ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీలు, కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ తదితరులు పాల్గొన్నారు.

# బోడమాణిక్యం తండాలో ఉద్రిక్తతల నడుమ శవాల తరలింపు

## భర్త ఇంటి ముందు శవాలు పూడ్చేందుకు యత్నం

**చెన్నారావుపేట, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తల్లి ఇద్దరి కుమారుల మృతదేహాలు తరళింపు అడుగడుగున తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంఘటన మండలంలోని బోడమాణిక్యంతండా గ్రామంలో బుధవారం రాత్రి నెలకొంది. ఇదే తండాకు చెందిన స్రవంతి తన ఇద్దరు కుమారులతో కలిసి హైదరాబాద్‌లోని కుకట్‌పల్లిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఇందుకు కారణం భర్త ప్రవీణ్ అంటూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనాన్ని రేకెత్తించింది. కాగా హైదరాబాద్‌నే ముగ్గురి శవాలకు పోస్టుమార్టం అనంతరం బుదవారం రాత్రి అంబులెన్స్ వాహనం తండాకు చేరుకుంది. అప్పటికే విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పదహారుచింతల్‌తండా నుంచి పెద్ద ఎత్తున బోడమాణిక్యతండాకు తరళివచ్చారు. చేతిలో కర్రలు పట్టుకొని ప్రధాన రహదారులపై మొహరించారు. నక్కలగుట్టతండా సమీపం నుండి బోడమాణిక్యతండా వెళ్లే క్రమంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు యంత్రాంగం శాంతిభద్రతలను పర్యవేక్షించినప్పటికి ఆగ్రహానికి లోనైన బంధువులు శవాన్ని పాడెపై ఉంచుకొని ప్రవీణ్ ఇంటివద్దకు తరళించారు. ఈ క్రమంలో అడుగడుగున ఆటంకాలే ఏర్పడ్డాయి. అప్పటికే తరలివచ్చిన బంధువులు ప్రవీణ్ ఇంటిముందే గొయ్యిలు తవ్వడం సంచలనాన్ని రేకెత్తించింది. శవాలు అక్కడికి రాగానే బంధువులంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. రాత్రి పది కావస్తున్న తండాలో ఇంకా ఉద్రిక్తత పరిస్థితులే నెలకొన్నాయి. న్యాయం జరిగేంత వరకు వెళ్లేది లేదంటూ వారంతా అక్కడే ఉండిపోయారు.

### హీరో అల్లుఅర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం

**బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 9-14ఏళ్ల మధ్య వయసున్న బాలికలంతా హెచ్‌పివి వ్యాక్సిన్ విధిగా తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పివి వ్యాక్సిన్ పై రూపొందించిన బ్రోచర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందించారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ రకాల నుండి రక్షణ కల్పించే సురక్షితమైన, అత్యంత ప్రభావ వంతమైన, దీర్ఘకాలిక రక్షణ కోసం ప్రభుత్వం హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఉచితం గా అందిస్తోందన్నారు. ఈ వ్యాక్సిన్‌ను బాలికలు తప్పనిసరిగా వేసుకోవాలని మంత్రి సూచించారు. హెచ్‌పివి వ్యాక్సిన్‌ను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.



మంగళ్ హాట్ లో కుళ్లిన మాంసం మూటలు

# 14 వేల కేజీల కుళ్లిన మాంసం సిటీలో సరఫరా

**కార్వాన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** చాలా మంది వ్యాపారులు కుళ్లిన మాంసాన్ని విక్రయించి,ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. తాజాగా పలు మాంసం విక్రయ దుకాణాల్లో పోలీసులు,జీహెచ్.ఎంసీ,టాస్క్ ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి. 14 వేల కేజీల కుళ్లిపోయిన మాంసాన్ని గుర్తించారు. మాంసాన్ని నిల్వచేసి విక్రయిస్తున్న యజమాని అఫ్రోజుని అరెస్టు చేశారు. హైదరాబాద్ లోని మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రాంతంలో ఏకంగా 14వేల కేజీల కుళ్లిన మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏ టూ జడ్ అనే గోదాంలో నిల్వ చేసిన మేక,గొర్రెల కళ్ళు,ఇతరత్ర మాంసాన్ని సిటీలోని ప్రముఖ హోటళ్లు, చిన్న చిన్న దుకాణాలకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మాంసాన్ని మహారాష్ట్ర,జమ్మూ కాశ్మీర్,ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు పాడైపోయిన మాంసాన్ని తీసుకొచ్చినట్లు తేల్చారు. యజమాని అఫ్రోజు అదుపులోకి తీసుకున్నారు.

# టెకీ దంపతుల ఆత్మహత్యలో కొత్త కోణం

**బెంగళూరు ఘటనలో ఎఐ కారణంగా ఉద్యోగం పోవడంతో మానసికంగా కృంగిపోయి సాఫ్ట్‌వేర్ దంపతుల బలవ్మరణం**

**భర్త ఆత్మహత్యతో 18వ అంతస్తు నుంచి దూకి భార్య ఆత్మహత్య**

**హైదరాబాద్‌లో ఇద్దరి అంత్యక్రియలు**



బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్న తెలంగాణకు చెందిన టెకీ దంపతులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెంగళూరులో టెకీ దంపతుల ఆత్మహత్య ఘటనలో కొత్త కోణం వెలుగు చూసింది. వీరిలో సిద్దిపేట జిల్లా అన్నాసాగర్‌కు చెందిన భానుచందర్ రెడ్డి (32) మొదట కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి అనంతరం అమెరికాలో మరో ఉద్యోగంలో చేరాడు. ఇతనితో పాటు భార్య బీబీ షాజియా సిరాజ్ (31) అమెరికా వెళ్లినట్లు తెలిసింది. అయితే ఎఐ కారణంగా అమెరికాలో అనేక మంది ఉద్యోగాలు కోల్పోగా అందులో భానుచందర్ రెడ్డి దంపతులు కూడా వున్నారని తెలిసింది. మంచి జీతంతో వుండే ఉద్యోగం పోవడంతో వీరి ద్దరు బెంగళూరుకు మకాం మార్చి అక్కడ ఏడాదిగా ఉద్యోగాన్వేషణలో వున్నారని తెలిసింది. అయితే మంచి వేతనంతో కూడిన ఉద్యోగం లభించక పోవడం, అమెరికా ఉద్యోగం పోవడంతో మానసికంగా భానుచందర్ రెడ్డి తీవ్రంగా కృంగి పోయినట్లుగా తెలిసింది. ఇదే సమయంలో భార్య సిరాజ్ రంజాన్ కోసం మేడ్చల్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఆమె లేని సమయంలో సోమవారం నాడు భానుచందర్ రెడ్డి బెంగళూరు పట్టణంలో తా నుండే అపార్ట్‌మెంట్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా సిరాజ్ మంగళవారం ఉదయం బెంగళూరుకు వెళ్లి తన అపార్ట్‌మెం ట్‌కు చేరుకుని తలుపులు తట్టగా లోపల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో భయపడ్డ సిరాజ్ తన భర్త భానుచందర్ రెడ్డిని పిలిచినా ప లుకలేదు. దీని తరవాత సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి తలుపుః బద్దలు కొట్టగా అప్పటికే అతను ఉరికి వేలాడుతున్నాడు. దీంతో తట్టుకోలేని సిరాజ్ అపార్ట్‌మెంట్ 18వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు విడిచింది. ఎఐ కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ముప్పు వుందని కొంతకాలంగా వా ర్తలు వస్తుండడం తెలిసిందే. ఇప్పటికే దీని కారణంగా చాలా మంది ఉద్యోగాలు కోల్పోయినట్లుగా వార్తలు వస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయం లో తెలంగాణకు చెందిన టెకీ దంపతులు ఆత్మహత్యలకు పాల్పడడం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో కలకలం రేపింది. కాగా వీరి మృతదేహాలను వారి వారి కుటుంబీకులు మంగళవారం రాత్రి తమ ఇళ్లకు తీసుకుపోయారు. బుధవారం ఉదయం సిద్దిపేట్ జిల్లా అన్నాసాగర్‌లో భానుచందర్ రెడ్డి అంత్యక్రి యలు జరగగా మేడ్చల్ టౌన్‌లో అతని భార్య సిరాజ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. వీరిద్దరు వివాహం చేసుకున్నట్లు తమకు ఎలాంటి సమాచార ం లేదని వారి కుటుంబీకులు చెబుతున్నారు. ఈ కారణంగానే వేరు వేరుగా అంత్యక్రియలు నిర్వహించామని కుటుంబీకులు తెలిపారు. ఆత్మహత్యల పై మాట్లాడేందుకు ఇద్దరి కుటుంబీకులు నిరాకరించారు.

# ఆంధ్ర ప్రజలకు అభినందనలు

**టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**


**హైదరాబాద్,ఏప్రిల్1,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించడాన్ని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.అయితే, ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నప్పటికీ, వాటి అమలులో కేంద్రం వివక్షపూరిత వైఖరిని ప్రదర్శించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం స్థాపన, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా వంటి ముఖ్య అంశాలు ఇంకా ఆచరణలోకి రాలేదని ఆయన గుర్తుచేశారు. ఇవన్నీ తెలంగాణ అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు. అలాగే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం తన హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపించారు.

# లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఢిల్లీకేపిటల్స్ ధమాకా!

## ఆరు వికెట్ల తేడాతో ఎల్‌ఎస్జీకి తప్పని ఓటమి

**లక్నో, ఏప్రిల్ 1:** ఐపిఎల్ 2026లో ఐదోమ్యాచ్‌గా లక్నోసూపర్‌జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీకేపిటల్స్ విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యాన్ని 17 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన లక్నో జట్టు నిర్ణీత ఓవర్లలో 141 పరుగులుచేసి ప్రత్యర్థి ఢిల్లీకి 142 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన ఢిల్లీకేపిటల్స్ నాలుగు వికెట్ల నష్టానికి 145 పరుగులుచేసింది. టార్గెట్‌ను 17.1 ఓవర్లలోనే ఛేదించింది. నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఒక దశలో 26 పరుగలకే 4 వికెట్లు కోల్పోయిన ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది. మ్యాచ్ ఓడిపోతుందేమో అని అందరూ అనుకున్నారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన సమీర్ రిజ్వీ నేనున్నానంటూ జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు సాధించాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ పరుగులే చేయలేకపోయాడు, పథుమ్ నిస్సంక (1), నితీష్ రాణా (15), అక్షర్ పటేల్ కూడా నిరాశపరిచాడు. ఇలా టాప్ ఆర్డర్ మొత్తం చేతులెత్తేశారు.

కానీ ట్రిస్టన్ స్టబ్స్‌తో (39) కలిసి రిజ్వి ఢిల్లీ జట్టును ఆదుకున్నాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, షమీ, మొహిసిన్ ఖాన్ చెరో వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ మార్ష్ (35), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అబ్దుల్ సమద్ (36) మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. లుంగీ ఎంగిడి, నటరాజన్ అద్భుత బౌలింగ్‌తో లక్నోను కోలుకోలేని దెబ్బతీశారు. రిషబ్ పంత్ (7), మార్క్‌రమ్ (11), బదోని (0), పూరన్ (8).. ఇలా టాప్ ఆర్డర్ మొత్తం పెవీలియన్‌కు క్యూ కట్టారు. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి, నటరాజన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా కుల్దీప్ 2, అక్షర్ పటేల్ 1 వికెట్ తీసుకున్నారు.




నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌ఎఆర్‌ఈడిసిఓ) తెలంగాణ 2026-28 మధ్య కాలానికి తమ నూతన కార్యనిర్వాహక కమిటి , కార్యనిర్వాహక బృందం సభ్యుల నియామకం గురించి వివరించిన చిత్రం

# నరెడ్కొ నూతన తెలంగాణ విభాగం కార్యవర్గం ఎన్నిక

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌ఎఆర్ ఇడిసిఒ) తెలంగాణ విభాగం నూతన కార్య వర్గం ఎన్నిక జరిగింది. నరెడ్కొ తెలంగాణ కార్య వర్గ నూతన అధ్యక్షుడిగా కొప్పుల శ్రీధర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్లుగా దామెర కాళి ప్రసాద్, గోపాలకృష్ణ కొరిపల్లి, ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కొండల సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎపిఆర్‌ఐఎల్ వేదికగా జరిగిన అసోసియేషన్ 30వ వార్షిక సర్వసభ్య సమావేశంలో కొతనత కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నికైన ఈ నూతన కార్యవర్గం 2026 నుండి 2028 వరకు రెండేళ్లపాటు పదవి బాధ్యతలను నిర్వహించనుంది. అసోసియేషన్ కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. రియల్ ఎస్టేట్ రంగంలో తెలంగాణ సుస్థిర అభివృద్ధిని పెంపొదించడం, వృత్తిపరమైన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా నూతన కార్య వర్గం పనిచేయనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొప్పుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యసాధనకు నరెడ్కొ కీలకంగా పనిచేస్తుందన్నారు.

# రోహిత్, మరో ఇద్దరి విచారణ

## మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎ ల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మలను చేవెళ్ల పోలీసులు రెండవ దఫా బుధవారం నాడు తమ కస్టడీలోకి తీసుకున్నారు. మాదకద్రవ్యాలు వాడినందుకు, పోలీసులపై కాల్పులు జరిపినందుకు ఈ ముగ్గురిని మార్చి 15వ తేదీన అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు గత నెల 24వ తేదీన మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించవం విదితమే. మొదటి దఫా కస్టడీలో ముగ్గురు ఆశించిన మేరకు సమాచారం వెల్లడించక పోవడంతో కోర్టు అ నుమతితో మరోసారి మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 11 గంటల సమయంలో చేవెళ్ల పోలీసులు చంచల్‌గూడ జైలుకు వెళ్లి రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల తరువాత నేరుగా శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్‌లో గల శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ వీరిని సాయంత్రం ఆరు గంటల వరకు విచారించారు. మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీపై పోలీసుల విచారణ మరింత వేగం పుంజుకుంది. గత నెల 14వ తేదీన జరిగిన పార్టీని అదేరోజు రాత్రి పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ పార్టీలో 11 మంది పాల్గొనగా వీరిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా ఆరుగురు డ్రగ్స్ సేవించినట్లు తేలడం విదితమే. ఫాం హౌస్‌లోకి వచ్చిన పోలీసులను బెదరగొట్టేందుకు రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు నమిత్ శర్మ నాలుగు రౌండ్లు కాల్పులు జరపగా అనంతరం అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమిత్ శర్మ కాల్పులు జరిపిన రివాల్వర్ రితేష్ రెడ్డిది కావడంతో రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో మరింతగా విచారించేందుకు వీరిని ఇప్పటికే ఒకసారి కస్టడీలోకి తీసుకోగా బుధవారం నాడు రెండవసారి తీసుకున్నారు. వీరి కస్టడీ విచారణ శుక్రవారం వరకు జరగనుంది. ఫా ం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో ఆ సమయంలో వున్న 11 మందితో పాటు మరో నలుగురు బయటి వ్యక్తుల ప్రమేయం వున్నట్లు పోలీసులు తేల్చా రు. ఇందులో బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ బాలాజితో పాటు మరో ముగ్గురు రాజకీయ నాయకుల పాత్రపైనా పోలీసులు ఆధారాలు సేకరించా రు. రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో ఐదేళ్లుగా డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నాయని ఆధారాలు సేకరించిన పోలీసులు దీనికి సంబంధించి కోర్టుకు పూర్తి వివరాలు అందించేందుకుగానూ ముగ్గురు నిందితులను మళ్లీ విచారిస్తున్నారు. రెండు వారాలకు పైగా జైల్లో వున్న వీరిని మొయినాబాద్ ఫాం హౌస్ కు తీసుకువెళ్లి పార్టీ జరిగిన రోజున ఏం జరిగిందనే దానిపై మరోసారి విచారించే వీలుంది. ఈ కేసులో డ్రగ్స్ పెడ్లర్ అభిషేక్ సింగ్ ఆచూకీ ఇప్ప టి వరకు తెలియక పోవడం మిస్టరీగా మారింది. అతన్ని పోలీసులు అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చినా ఇది ధృవీకరణ కాలేదు. తాము అతన్ని అరె స్టు చేయలేదని పోలీసులు తెలిపారు. అభిషేక్ సింగ్ తండ్రి దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. అ భిషేక్ సింగ్ పట్టుబడితే మరిన్ని విషయాలు వెలుగుచూసే వీలుంది.

# శ్రీచైతన్య విద్యార్థుల విజయ దుందుభి

## నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టులో 71శాతం అవార్డులు కైవసం

### విద్యార్థులు, తల్లిదండ్రులకు డైరెక్టర్ సీమ అభినందనలు

**హైదరాబాద్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** అమెరికాకు చెందిన నాసా ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-2026 ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ మరోసారి విజయాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లో వరుసగా 15వసారి వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి విజయ దుందుబి మోగించింది. భారతదేశం గెలిచిన అవార్డుల్లో 71 శాతం శ్రీ చైతన్యవే కావడం విశేషం. ఈ ఏడాది పోటీల వివరాలను శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ వెల్లడిస్తూ... ఈ ఘనత సాధించిన ఏకైక విద్యాసంస్థ ప్రపంచంలో తమదేనన్నారు. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 31 దేశాలు పాల్గొన్నాయని, మొత్తం ప్రకటించిన 134 విన్నింగ్ ప్రాజెక్టుల్లో భారతదేశం 80 అవార్డులను కైవసం చేసుకోగా అందులో అత్యధికంగా 57 అవార్డులను ఒక్క శ్రీ చైతన్య విద్యార్థులే గెలుచుకున్నారని చెప్పారు. భారతదేశం సాధించిన మొత్తం ఫలితాల్లో 71 శాతం వాటా శ్రీ చైతన్యదేనని, విద్యార్థులు సాధించిన 57 విన్నింగ్ ప్రాజెక్టుల్లో ప్రపంచస్థాయి ఫస్ట్ ప్రైజ్6 ప్రాజెక్టులు, సెకండ్ ప్రైజ్ 11 ప్రాజెక్టులు, థర్డ్ ప్రైజ్ 10 ప్రాజెక్టులు, హానరేబుల్ మెన్షన్స్‌లో 30 ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. ఈ 57 ప్రాజెక్టుల్లో మొత్తం 549 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారని ఆమె తెలిపారు. ప్రపంచంలోని మిగిలిన 30 దేశాలన్నీ కలిసి మొత్తం 54 విన్నింగ్ ప్రాజెక్టులను గెలుచుకోగా, ఒక్క శ్రీ చైతన్య మాత్రమే 57 ప్రాజెక్టులు సాధించడం దేశానికే గర్వకారణమన్నారు. అవార్డుల సంఖ్యలో, పాల్గొన్న విద్యార్థుల సంఖ్యలోనూ శ్రీచైతన్య విద్యాసంస్థనే అగ్రగామిగా ఉందన్నారు. ఘనవిజ యం సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# గిరిజనులకు పెండింగ్ సబ్సిడీ విడుదల

## రూ.12.30 రిలీజ్ చేసిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక బలాన్ని అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం ఎస్టీఈఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్ ట్రైబ్స్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ అండ్ ఇన్నోవేషన్) పథకానికి సంబంధించి ఎట్టకేలకు సబ్సిడీ విడుదలైంది. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సబ్సిడీలను ఆర్థిక శాఖ విడుదల చేసింది. రాష్ట్రంలో ఈ పథకం పరిధిలో మొత్తం 200 మంది గిరిజన అభ్యర్థులు ఎంపిక కాగా, అందులో 18 మంది తుది ప్రొసీడింగ్స్ పొందారు. అయితే ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సబ్సిడీ విడుదలలో ఆలస్యం కారణంగా లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.50 కోట్లలో భాగంగా ఒక త్రైమాసిక నిధులు రూ.12.30 కోట్లు విడుదలయ్యాయి. అందులో రూ.8.16 కోట్లు 18 మంది లబ్ధిదారులకు సబ్సిడీగా అందచేస్తున్నారు.

# సింగరేణిలో 81 శాతం బొగ్గు ఉత్పత్తి

## మార్కెట్లో డిమాండ్ సమస్య

### బొగ్గు వెలికితీతను తగ్గించిన సంస్థ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** గత రెండు దశాబ్దాలుగా లాభాల్లో నడుస్తున్న సింగరేణి కాలరీస్ బొగ్గు ఉత్పత్తిలో 81 శాతం మేర లక్ష్యాన్ని సాధించింది. మార్చి నెలాఖరుతో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, 58 మిలియన్ టన్నుల (81 శాతం) ఉత్పత్తిని సాధించింది. సింగరేణి వ్యాప్తంగా ప్రతిరోజూ 2.81 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, వివిధ కారణాల వల్ల కేవలం 1.90 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. సత్తుపల్లి, బెల్లపల్లి మినహా కొత్తగూడెం, ఎల్లందు, మణుగూరు, రామగుండం, ఏపీఏ, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోనూ ఉత్పత్తి తగ్గింది. మార్కెట్‌లో బొగ్గుకు గిరాకీ లేకపోవడం, కొత్త బొగ్గు గనుల ప్రారంభం ఆలస్యం కావడం లక్ష్యాన్ని సాధించలేకపోవడానికి కారణాలని అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రేడ్14, 15, 16 రకం బొగ్గును పొందడానికి థర్మల్ పవర్ స్టేషన్లు అభ్యంతరాలు తెలపడంతో, ఉత్పత్తి తగ్గుతుందని అంచనా వేసిన అధికారులు కొన్ని ప్రాంతాలలో ఉత్పత్తిని తగ్గించినట్లు సమాచారం. సింగరేణి అంతటా గ్రేడ్ 15 రకం బొగ్గు విస్తృతంగా ఉత్పత్తి అవుతోంది. అయితే, ఈ రకానికి మార్కెట్ లేదు. అంతేకాకుండా, నాణ్యత తక్కువగా ఉందనే కారణంతో థర్మల్ పవర్ స్టేషన్లు ఈ రకాన్ని తిరస్కరిస్తున్నాయి. ముఖ్యంగా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ స్టేషన్లు గ్రేడ్ 14, 15 రకం బొగ్గును స్వీకరించడం లేదు.

# పిఆర్సీ బకాయిలు చెల్లింపునకు కృషి

## సింగరేణి సిఎండి బుద్ధప్రకాశ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** సింగరేణిలో పనిచేస్తున్న అధికార్లకు రావాల్సిన పీఆర్సీ బకాయిల చెల్లింపునకు కృషి చేస్తానని సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్ హామీ ఇచ్చారు. హైదరాబాద్లోని సింగరేణి భవన్‌లో కోల్మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇండియా సింగరేణి బ్రాంచీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న అధికారుల పే అప్గ్రేడేషన్ గురించి అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తదుపరి త్వరలో కోలిండియాకు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. పీఆర్సీ బకాయిల చెల్లింపు విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. మిగిలిన ఇతర సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే స్ట్రక్చర్డ్ మీటింగ్ ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు.

## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# విశ్వనాథ్, సచిన్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2026 లో భారత బాక్సర్లు విశ్వనాథ్ సురేష్, సచిన్‌లు ఘన విజయాలు సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. ఉలాన్‌బాతర్‌లో బుధవారం జరిగిన పురుషుల 50 కేజీల విభాగంలో పోటీపడిన విశ్వనాథ్ సురేష్, కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన బెక్జాత్ ఎర్గెషోవ్‌ను 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించి ఆధిపత్య ప్రదర్శన కనబరిచాడు.



ఈ భారత బాక్సర్ కచ్చితత్వంతో, సమర్థవంతమైన రింగ్ నిర్వహణతో బౌట్‌ను తన అదుపులో ఉంచుకుని, సునాయాసన విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. తదుపరి రౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, ఇటీవలి ప్రపంచ కప్ విజేత అయిన సంజార్ తాష్కెన్‌బేతో మరింత కఠినమైన సవాలును ఎదుర్కోనున్నాడు. అలాగే పురుషుల 60 కేజీల విభాగంలో, సచిన్ మంగోలియాకు చెందిన బుయాండలై బాయర్ఖూపై 4-1 తేడాతో స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని సాధించాడు. ఈ బౌట్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. కానీ సచిన్ సంయమనం పాటించి స్కోర్ కార్డులలో స్వల్ప ఆధిక్యంతో ముందంజలో నిలిచాడు. టోర్నమెంట్‌లో తన విజయ పరంపరను కొనసాగించే ప్రయత్నంలో, అతను తన రాబోయే పోరులో చైనీస్ తైపీకి చెందిన చెంగ్‌వీ లీతో తలపడనున్నాడు.

# ఫిడే కాండిడేట్స్‌లో ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే కాండిడేట్స్-2026 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద తొలి ఓటమి చవిచూశాడు. మహిళల విభాగంలో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ తన ఆటను డ్రా గా ముగించింది. సైప్రస్‌లో జరిగిన ఈ పోటీలో ఆధిక్యాన్ని కోల్పోయిన ప్రజ్ఞానంద ఈ టోర్నమెంట్‌లో ప్రత్యర్థి ఎత్తులకు చిత్తయ్యాడు. ఈ ఓటమితో ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానానికి పడిపోయి, ప్రస్తుతం సంయుక్త అగ్రగాములుగా



ఉన్న ఫాబియానో కరువానా (యూఎస్ఏ), జవోఖిర్ సిందరోవ్ (యూజెడ్బీ)ల కంటే ఒక పాయింట్ వెనుకబడ్డాడు. అలాగే దివ్య దేశ్‌ముఖ్ రౌండ్3లో అలెగ్జాండ్రా గోర్యాచ్కినాతో జరిగిన మ్యాచ్‌లో వరుసగా తన మూడవ డ్రాను నమోదు చేసింది. నల్ల పావులతో ఆడుతున్న దివ్య, గోర్యాచ్కినాకు వ్యతిరేకంగా ఆడిన సిసిలియన్ డిఫెన్స్ యొక్క రూక్‌పాన్ ఎండ్‌గేమ్‌లో కొన్ని తప్పులు చేయడంతో, ఇరుజట్ల స్థానాలు పూర్తిగా తారుమారుఅయి, మ్యాచ్‌డ్రాగా ముగిసింది. ఇకవైశాలి కూడా వరుసగా తన 3వ డ్రాను నమోదు చేసింది. ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజిచుక్‌తో అత్యంత నాణ్యమైన ఆటలో ఇద్దరు క్రీడాకారులు 98శాతానికిపైగా ఖచ్చితత్వాన్ని కొనసాగించి ఆమెను నిలువరించింది.



## టి20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో..
# అగ్రస్థానాల్లో అభిషేక్, కిషన్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆటగాళ్లు దుమ్ముదులిపారు. టీమిండియా ప్లేయర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ రెండు అగ్ర స్థానాల్లో కొనసాగుతున్నారు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్ ప్రకారం, భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్లలో నంబర్ 1, ఇషాన్ కిషన్ టాప్ 2 స్థానాలను నిలబెట్టుకున్నారు. అభిషేక్ 875 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, కిషన్ 849 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మూడో స్థానంలో పాకిస్తాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ 848 పాయింట్లతో ఉన్నాడు. న్యూజిలాండ్‌లో ఇటీవల జరిగిన దక్షిణాఫ్రికా టీ20ఐ సిరీస్‌లో ఎస్టర్‌హుయిజెన్ 200 పరుగులు చేసి టాప్ 100 టీ20ఐ బ్యాటర్ల జాబితా వెలుపల నుండి మొత్తం మీద 39వ స్థానానికి ఎగబాకాడు. ప్రోటీస్‌పై 81 పరుగులు చేసిన న్యూజిలాండ్ వికెట్ కీపర్ టిమ్ రాబిన్సన్, రెండు స్థానాలు పైకి ఎగబాకి 32వ స్థానాన్ని సమం చేయడంతో పాటు, టీ20ఐ బ్యాటింగ్ జాబితాలో కూడా ముందంజ వేశాడు. ఇంగ్లండ్ వెటరన్ జోస్ బట్లర్ ఒక స్థానం పైకి ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకోగా, న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్ ఒక స్థానం దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. బౌలర్ల ర్యాంకింగ్‌లలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లలో తమ ప్రదర్శనల తర్వాత పలువురు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు పెద్ద విజేతలుగా నిలిచారు. పేస్ త్రయం జెరాల్డ్ కోట్జీ (36 స్థానాలు ఎగబాకి 52వ స్థానంలో నిలిచాడు), ఒట్నీల్ బార్ట్‌మన్ (10 స్థానాలు ఎగబాకి 56వ స్థానానికి), మరియు జార్జ్ లిండే (ఆరు స్థానాలు ఎగబాకి 62వ స్థానంలో నిలిచాడు) గణనీయమైన పురోగతిని సాధించారు. ఇక జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా టీ20ఐ ఆల్ రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## ఆసియా కప్ క్వాలిఫైయింగ్‌లో..
# ప్రతీకారం తీర్చుకున్న భారత్
### 2-1 తేడాతో హాంకాంగ్ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్‌పై 2-1 తేడాతో విజయం సాధించి, భారత్ తన ఏఎఫ్‌సి ఆసియా కప్ 2027 క్వాలిఫైయింగ్ ప్రచారాన్ని ముగించింది. ఈ మ్యాచ్‌లో ర్యాన్ విలియమ్స్ అరంగేట్రంలోనే గోల్ చేయగా, ఆకాష్ మిశ్రా తన తొలి అంతర్జాతీయ గోల్‌తో బ్లూ టైగర్స్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఈ ఫలితం సాధించినాభారత్ ఐదు పాయింట్లతో గ్రూప్ సి లో అట్టడుగున నిలిచింది. బంగ్లాదేశ్ కూడా ఐదు పాయింట్లతో, మెరుగైన హెడ్ టు హెడ్ రికార్డు కారణంగా భారత్ కంటే ముందు నిలిచింది. అయినప్పటికీ, ఖలీద్ జమీల్ జట్టు, అంతకుముందు రెండు డ్రాల తర్వాత మూడవ రౌండ్‌లో తమ మొదటి విజయాన్ని నమోదు చేశాడు. ఆస్ట్రేలియాలో జన్మించిన ర్యాన్ విలియమ్స్, తన కొత్త దేశం తరపున తొలి మ్యాచ్ ఆడుతూ నాలుగో నిమిషంలో గోల్ చేసి ఆతిథ్య జట్టుకు ఆరంభ ఆధిక్యాన్ని అందించాడు. మన్వీర్ సింగ్ అందించిన లో క్రాస్‌ను అతను తొలి ప్రయత్నం లోనే గోల్‌గా మలిచాడు. విలియమ్స్ గతంలో ఎఎఫ్‌సి అండర్ 19 ఛాంపియన్‌షిప్ (2012), అండర్ 20 ప్రపంచ కప్ (2013) సహా యువ స్థాయిలో ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఆకాశ్ మిశ్రా ద్వారా 50వ నిమిషంలో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఇది ఆ లెఫ్ట్‌బ్యాక్‌కు తొలి అంతర్జాతీయ గోల్. 65వ నిమిషంలో ఎవర్టన్ కామార్గో ద్వారా హాంకాంగ్ స్పందించి, మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా ముగించింది.

67వ నిమిషంలో విలియమ్స్ మైదానం వీడటం, అలాగే అన్వర్ అలీ స్థానంలో మరొకరిని తీసుకోవడంతో భారత జట్టుకు ఆఖరి



నిమిషాల్లో గాయాలు మొదలయ్యాయి. ఈ ఎదురుదెబ్బలు తగిలినా ఆతిథ్య జట్టు తమ ఆధిక్యాన్ని కాపాడుకోవడానికి గట్టిగా నిలబడింది. గత ఏడాది జూన్ 10న కౌలూన్‌లో జరిగిన రివర్స్ మ్యాచ్‌లో హాంకాంగ్ చేతిలో 1-0 తేడాతో ఓటమి పాలైన భారత్, ఈ ఫలితంతో ప్రతీకారం తీర్చుకుంది.

# టెస్ట్ క్రికెట్‌ను వన్డేల్లా ఆడిన హీరోలు
### లిస్టులో నంబర్‌వన్ టీమిండియా కింగ్

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్ అనగానే బ్యాట్స్‌మెన్ ఓపికగా, నిలకడగా ఆడే ఫార్మాట్ అని అందరూ భావిస్తారు. కానీ, కొందరు ఆటగాళ్లు మాత్రం తమ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సంప్రదాయాన్ని తిరగ రాశారు. కనీసం 50 టెస్టులు ఆడి, 5000కు పైగా పరుగులు చేసి, 40కి పైగా సగటు కలిగిన ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటే అందులో టీమిండియా హీరో కూడా ఉన్నాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో నంబర్ వన్ విధ్వంసకర బ్యాట్స్‌మెన్ ఎవరంటే అందరికీ గుర్తొచ్చే పేరు వీరేంద్ర సెహ్వాగ్. నజఫ్‌గఢ్ నవాబ్‌గా పేరుగాంచిన సెహ్వాగ్, టెస్ట్ క్రికెట్‌ను టీ20 తరహాలో ఆడి రికార్డులు సృష్టించాడు. 82.21 స్ట్రైక్ రేట్‌తో 104 టెస్టుల్లో 8586 పరుగులు చేసిన అతడు, బౌలర్లకు పీడ కలగా మారాడు. ఫార్మాట్ ఏదైనా బంతిని బాదడమే లక్ష్యంగా ఆడే సెహ్వాగ్ శైలి క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. టెస్ట్ క్రికెట్ బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసిన మొనగాడిగా చరిత్ర లో నిలిచాడు. రెండో స్థానంలో ఆస్ట్రేలియాకే చెందిన లెజెండరీ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఉన్నాడు. ఏ స్థానం లోనైనా, ఏ బౌలర్‌నైనా ఊచకోత కోయగల సామర్థ్యం ఉన్న గిల్‌క్రిస్ట్ ఏకంగా 81.96 స్ట్రైక్ రేట్‌తో టెస్ట్ ఫార్మాట్‌ను శాసించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెక్కల్లమ్, క్రిస్ గేల్ లాంటివారు ఉన్న విషయం తెలిసిందే. ఇక మూడో స్థానంలో ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ నిలిచాడు. వన్డే తరహాలోనే టెస్టుల్లోనూ విరుచుకుపడే వార్నర్, 74.02 స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను హడలెత్తించాడు. అతడి తర్వాత నాలుగో స్థానంలో మరో లంక వీరుడు తిలకరత్నే దిల్షాన్ ఉన్నాడు. తనదైన దిల్‌స్కూప్ షాట్లతో 65.52 స్ట్రైక్ రేట్‌తో అతడు టెస్టుల్లో అలరించాడు. ఈ



జాబితాలోని ఐదో స్థానంలో శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య నిలిచాడు. 110 టెస్టుల్లో 65.27 స్ట్రైక్ రేట్‌తో దాదాపు 7000 పరుగులు చేసిన అతడు ఓపెనర్‌గా బౌలర్లపై ఎదురుదాడి చేయడంలో దిట్ట.

# జీఎస్టీ వసూళ్ల రికార్డు
### మార్చి నెలలో రూ.2 లక్షల కోట్లు రాబడులు




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సరికొత్త రికార్డు సాధించాయి. 2026 మార్చి నెలలో జీఎస్టీ ఆదాయం తొలిసారిగా రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటింది. ఇవాళ విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం మార్చిలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 2,00,064 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో వసూలైన రూ. 1,83,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం అధికం. దేశీయంగా స్థిరమైన ఆదాయంతో పాటు దిగుమతులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ. 1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే 8.2 శాతం ఎక్కువ.

మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ. 22.27 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ. 20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 7 శాతం జీడీపీ వృద్ధితో ముందుకు సాగుతున్న తరుణంలో జీఎస్టీ వసూళ్లు కూడా అదే స్థాయిలో పెరగడం శుభపరిణామమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న వినియోగం, దిగుమతులు, మెరుగైన పన్నుల చెల్లింపుల వ్యవస్థ దీనికి కారణమని వారు అభిప్రాయపడ్డారు. గత 12 నెలలుగా జీఎస్టీ వసూళ్లు వరుసగా రూ. 1.7 లక్షల కోట్ల కంటే పైనే నమోదు కావడం గమనార్హం. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ.1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే ఇది 8.2 శాతం ఎక్కువ. ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లకు చేరాయి. ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి.





# డిజిటల్ చెల్లింపులకు అంతరాయం!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులకు బుధవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువ కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతో పాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని తెలిపారు. ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ అవ్వలేదు. ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలగవచ్చని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈరూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.


## బులియన్ మార్కెట్‌లో
# మళ్లీ పసిడి పరుగులు

**ముంబయి, ఏప్రిల్ 1:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 1,51,500కి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. మరోవైపు కిలో వెండి ధర కూడా రూ. 5,000 పెరిగి రూ. 2.37 లక్షలకు ఎగబాకింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం ధరల పెరుగుదలకు దోహదపడింది. ఇరాన్‌తో యుద్ధం రెండు, మూడు వారాల్లోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి ధరలు బలపడ్డాయి. ఆసియా ట్రేడింగ్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 1.25 శాతం పెరిగి 4,737 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయనే



అంచనాలు కూడా ధరలకు మద్దతునిచ్చాయి. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,250 మేర పెరిగింది. ఒక గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ. 14,827 పలుకుతుండగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ. 13,591గా ఉంది. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం ముందురోజు నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 1,46,733గా ఉంది. మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు కావడంతో అవే ధరలు కొనసాగాయి. ఈ తాజా పెరుగుదలకు ముందు మార్చి నెలలో బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. ఇంధన ధరల పెరుగుదల, వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి వంటి కారణాలతో గత 17 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా మార్చిలో పసిడి విలువ దాదాపు 15 శాతం క్షీణించింది.

**వాణిజ్యం**




# బ్యాంకింగ్ రంగంలో ఖాతా పోర్టబిలిటీకి ఆర్‌బిఐ కసరత్తు

**ముంబయి, ఏప్రిల్ 1:** భారతీయ బ్యాంకింగ్ రంగంలో ఆర్బీఐ విప్లవాత్మక మార్పులు తెస్తోంది. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలోనే, వినియోగదారులు తమ బ్యాంకు ఖాతా నంబర్‌ను మార్చుకోకుండానే ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు మారే సౌలభ్యాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. ఆర్‌బీఐ ఇటీవల ఆవిష్కరించిన ఎమెంట్స్ విజన్ 2028 డాక్యుమెంట్‌లో ఈ కీలక ప్రతిపాదనను చేర్చింది. ఇది అమల్లోకి వస్తే, బ్యాంకింగ్ సేవల్లో కస్టమర్లకు మరింత స్వేచ్ఛ లభించనుంది.ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఆర్‌బీఐ పేమెంట్స్ స్విచ్చింగ్ సర్వీస్ అనే కేంద్రీకృత టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ను రూపొందిస్తోంది. దీని ద్వారా కస్టమర్ ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు మారినప్పుడు, వారి ఈఎంఐలు, సిప్‌లు, ఇతర ఆటోడెబిట్ చెల్లింపుల ఆదేశాలు అన్నీ ఆటోమేటిక్‌గా కొత్త బ్యాంకుకు బదిలీ అవుతాయి. దీంతో వినియోగదారులు ప్రతిచోటా తమ ఖాతా వివరాలను మాన్యువల్‌గా మార్చుకోవాల్సిన శ్రమ తప్పుతుంది. ప్రస్తుతం బ్యాంకును మార్చడం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. జీతం ఖాతా, పెట్టుబడులు, ప్రభుత్వ పథకాలతో ముడిపడి ఉండటంతో చాలామంది ఇష్టం లేకపోయినా పాత బ్యాంకులోనే కొనసాగుతున్నారు. ఈ కొత్త విధానం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే బ్యాంకును సులభంగా ఎంచుకునే అవకాశం లభిస్తుంది. ఇది బ్యాంకుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచి, సేవల నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడుతుంది. ఖాతా నంబర్ మారకపోయినా కొత్త బ్యాంకుకు సంబంధించిన ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ మారుతుంది. పాత బ్యాంకులో ఉన్న లోన్లు, ఇతర ఆర్థిక బాధ్యతలు, క్రెడిట్ హిస్టరీ వంటివి యథాతథంగా కొనసాగుతాయి. ఈ పోర్టబిలిటీ కేవలం ఖాతా మార్పును సులభతరం చేస్తుంది.

# రికవరీ దిశగా మార్కెట్లు!
### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 1:** నెలరోజుల్లోనే రూ.51 లక్షలకోట్లు నష్టాలు చవిచూసిన మార్కెట్లు బుధవారం రికవరీ అయ్యాయి. సెన్సెక్స్,నిఫ్టీ రెండూ కూడా లాభాల్లోనే ముగిసాయి. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించేస్తామన్న అమెరికా అద్యక్షుడి సంకేతాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. దీనితో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయని అందరూ భావించారు. బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు నమోదయింది. అమెరికా బాండ్ల రాబడులు కూడా కొంత సానుకూలంగా మారాయి. నిఫ్టీ 22,650 మార్కువద్ద ముగిసింది. పిఎస్‌యు బ్యాంకులు, మెటల్‌స్టాక్స్ ర్యాలీ తీసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1186.77 పాయింట్లు పెరిగి 73,134.32 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ 348 పాయింట్లు లాభపడి 22,679.40 వద్ద ముగిసింది. గడచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 4.41శాతం, నిఫ్టీ 4.18శాతం క్షీణించింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 2.25 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 3.44 శాతం పెరిగాయి. మొత్తంగ బిఎస్‌ఇ లో 3828 షేర్లుపెరిగితే 508 షేర్లు క్షీణించాయి.105షేర్లు ఎలాంటి మార్పులకు నోచుకోలేదు. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో రూపాయి కొంతమేర బలపడింది. 94.70 వద్ద ట్రేడింగ్‌ముగించింది. అంతకు ముందు 94.85వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌ఐదు



సెటిల్‌మెంట్లు రూ.1,52,038వద్ద ముగిసాయి. అమెరికా పదేళ్ల రాబడులు కూడా 4.281శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్‌లు 30 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 103.67 డాలర్లవద్ద నిలిచింది. ఇక విదేశీ మార్కెట్లపరంగా యుఎస్ డౌజోన్స్ ఫ్యూచర్స్ 302 పాయింట్లుపెరిగింది. యూరోపియన్‌స్టాక్స్ ట్రంప్ సిగ్నల్స్‌తో పెరుగుదల నమోదుచేసింది. స్పెయిన్ ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ 48.7గా నమోదయింది. జర్మనీ పీఎంఐ 52.2పాయింట్లకుపెరిగింది. ఆసియా మార్కెట్లు కూడా ట్రంప్ వ్యాఖ్యలతో గణనీయంగా రికవరీ అయ్యాయి. చైనా ఉత్పత్తిరంగ పీఎంఐ సూచీ 50.8పాయింట్లుగా ఉంది. అమెరికా మార్కెట్లు రాత్రికిరాత్రే ర్యాలీతీసాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 1125.37 పాయింట్లుపెరిగింది. ఎస్‌అండ్‌పి 500 2.91శాతం పెరిగి 6528.52 పాయింట్లవద్ద ముగిసింది. నాస్‌డాక్ కాంపోజిట్ 21,590.63 పాయింట్లవద్దకు చేరింది. ఇండిగోషేర్లు 6.01శాతంపెరిగితే సీన్సిస్‌టెక్ 11.03శాతం, ఎంటార్ టెక్నాలజీస్ 3.85శాతం, ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఐరెడా 4.21శాతంపెరిగాయి. అలాగే ఆదాని పోర్టులుప్రత్యేక ఆర్థిక మండళ్లు జోన్ 5.47శాతంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.